J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 41 సంచిక : 48 06.5.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## పార్టీలోనూ... పాలనలోనూ...

# గేరు మార్చి.. స్పీడు పెంచిన సీఎం

- ☆ మూడేళ్ళ తరువాత మళ్ళీ జనంలోకి వస్తున్న జగన్
- ☆ పథకాల ప్రారంభోత్సవాల పేరుతో ప్రజల ముందుకి ముఖ్యమంత్రి
- ☆ పార్టీ నేతలకు అధికార హోదా... జిల్లా అధ్యక్షులకు క్యాబినెట్ ర్యాంకు
- ☆ పార్టీని - ప్రభుత్వాన్ని సమానం చేసి సమన్వయం చేసే ప్రయత్నం

*ప్రజా సంకల్పయాత్ర పేరుతో... మూడువందలా నలభైఒక్క రోజులు ఇల్లు విడిచి, మూడువేల ఆరు వందల నలభై ఎనిమిది కిలోమీటర్లు నడిచి, మూడుకోట్లకుపైగా ప్రజల హృదయాలలో నిలిచి, **175**కు గాను **151** సీట్లలో గెలిచిన ఏకైక నాయకుడిగా ఘనత సాధించిన యువ నాయకుడు ఆంధ్రా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. ఇప్పుడు ఆయన అధికార పగ్గాలు చేపట్టి మరో మూడు వారాలలో మూడేళ్ళు పూర్తి కావస్తోంది. ఈ తరుణంలో ఆయన మూడ్ మారినట్లుగా కనిపిస్తోంది.*

రాష్ట్ర పరిపాలనలో, పార్టీ పటిష్టతలో జగన్ ఉన్నట్లుండి గేరు మార్చి... వేగం పెంచారు. ఇన్నాళ్ళూ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నలుగురితో కలసి నాలుగు గోడల మధ్యనే నిర్వహిస్తుండిన బటన్ నొక్కే కార్యక్రమాన్ని ఇప్పుడు జనం మధ్యలోకి తీసుకొచ్చారు.

తాజాగా 'విద్యాదీవెన' పథకంలో భాగంగా మే 5వ తేదీ గురువారం నాడు తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో బటన్ నొక్కి 10.85 లక్షలమంది విద్యార్థినీ విద్యార్థుల తల్లుల ఖాతాలో 709 కోట్ల రూపాయలను నేరుగా జమ చేశారు. ఒక్కసారిగా నారాయణ, శ్రీ చైతన్య విద్యా సంస్థలపైనా విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రశ్నాపత్రాల లీకేజీకి ఆ రెండు విద్యా సంస్థలే కారణమంటూ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 10లో










## సంస్మరణ

సామాన్యులను నాయకులుగా మలచిన
రాజకీయ యోధుడు
పేద, దళిత, బడుగు, బలహీన వర్గాల
జనబాంధవుడు
రాజకీయాలలో తనదైన ముద్రవేసుకున్న
ప్రజానాయకుడు
మాజీ ముఖ్యమంత్రి

### శ్రీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారు

స్వర్గస్తులై తేది.09.05.2022 నాటికి
ఎనిమిదేళ్ళు గడవనున్న సందర్భంగా
*వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...*

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**
చైర్మెన్, నేదురుమల్లి ఫౌండేషన్

# వేడివేడిగా.. 'నీళ్ళ సలహా మండలి' సమావేశం

- చుక్కల భూముల తిప్పలు..ధాన్యం కొనుగోళ్ళలో అవస్తలు
- సిఎంనే తప్పుదోవ పట్టించే విధానాలు
- అధికారుల తీరుపై మండిపడ్డ సభ్యులు.. సర్దిచెప్పిన మంత్రి కాకాణి





*ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరగడం లేదు. చుక్కల భూముల సమస్యలు తీరడమే లేదు. నీటిపారుదల పనులు నత్తనడక నడుస్తున్నాయి.. అంటూ ప్రజాప్రతినిధులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'ప్రాజెక్టుల ప్రారంభోత్సవం విషయంలో ముఖ్యమంత్రినే మోసం చేస్తారా?.. తప్పుదోవ పట్టిస్తారా?.. ఇదేం పద్ధతి?'.. అంటూ ఆ శాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇకనైనా పనితీరు మార్చుకోండి.. అంటూ హితవు పలికారు. స్వపక్షమే విపక్షంలా విమర్శలు గుప్పించడంతో, కొత్తగా కాకాణి మంత్రయ్యాక ఇటీవల జరిగిన తొలి నీళ్ళ సమావేశం.. చల్లగా సాగుతుందనుకుంటే.. అందుకు భిన్నంగా ఈసారి వేడివేడిగా జరిగింది.*

జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం గరంగరంగా సాగింది. నీటిపారుదల శాఖ అధికారుల పనితీరు ఏమీ బాగుండడం లేదని.. అయినవారే అసంతృప్తి వ్యక్తం చేస్తుంటే అధికారులు అవాక్కయిపోయారు. ఏళ్ళ తరబడిగా చుక్కల భూముల తిప్పలు తీర్చేశామని చెప్పడమే తప్ప ఆ సమస్యలు నేటికీ ఒక కొలిక్కి వచ్చింది లేదు. వరి రైతులకు ధాన్యం కొనుగోళ్ళ విషయంలో అన్ని ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేశామని చెప్పడమే తప్ప రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు న్యాయం జరగడం లేదు. మద్దతు ధర రాకపోగా రైతులు దళారుల, మిల్లర్ల నిలువు దోపిడీకి గురవుతూనే ఉన్నారు. అంతా బాగానే ఉందంటూ సభలు పెట్టేసుకుని పాలకులు అధికారులు చప్పట్లు కొట్టు కుంటున్నారే తప్ప క్షేత్రస్థాయిలో ఆశించిన విధంగా ఏ సమస్యలూ తీరడం లేదు. ఈ నేపథ్యంలో, సభ్యులందరూ మనవాళ్లే కదా.. చూసీ చూడనట్లు పోతారులే అనుకున్నట్లుంది అధికారులు. కానీ, సభ్యులు మాత్రం ఎంతకాలం అలాచూస్తూ గమ్మునా ఉంటారు. ఒక్కసారిగా దుమ్ము దులిపేశారు. ఇటీవల జరిగిన ఐఏబి సమావేశంలో అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. చుక్కల భూముల సమస్యల సంగతేం టని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ అంశాన్ని లేవనెత్తడం, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిలు మా ప్రాంతాల్లో కూడా ఆ సమస్యలు కొల్లలుగానే ఉన్నాయని ఏకరువు పెట్టడంతో సభలో కలవరం చెలరేగింది. మంత్రి కాకాణి కలుగజేసుకుని చుక్కలభూముల విషయంలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని అంగీకరిస్తూ, స్పెషల్ డ్రైవ్ పెట్టి పరిస్థితులు చక్కదిద్దుతామని చెప్పడంతో సభ్యులు శాంతించారు.

## సిఎంకి చెప్పిందొకటి.. మీరు చేసేదొకటి? :

ఇటీవల వరదల నేపథ్యంలో పెన్నా పొర్లుకట్టల నిర్మాణానికి సంక్రాంతి వెళ్ళాక సిఎం స్వయంగా వచ్చి ఆ పనులకు శంకుస్థాపన చేస్తానని ప్రకటించారని, అయితే ఆ పనులు ఇప్పటికీ టెండర్ల దశ కూడా దాటకపోవడం ఏమిటని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. సంగం, నెల్లూరు బ్యారేజీలను మూడువారాల్లో పూర్తిచేయిస్తామంటూ సిఎం చేత అధికారులు ప్రకటన చేయించారని, కానీ ఆ మూడు వారాలూ గడిచిపోయినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రతిపక్షాలు అడుగుతున్నాయని, అందుకు సమాధానం ఏమి చెప్పాలని ఆయన అధికారులను నిలదీశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రినే తప్పుదోవ పట్టించడం దారుణమని, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడం బాగాలేదని ఆయన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల సిఎం మూడుసార్లు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కూడా ఈ విషయాలను ప్రస్తావించారన్నారు. సంగం బ్యారేజీకి దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి పేరును కూడా పెడుతూ అసెంబ్లీలో తీర్మానించారని, సంగం-నెల్లూరు బ్యారేజీల ప్రారంభోత్సవానికి తాను వస్తానని సిఎం పదేపదే చెప్పారని ఆయన గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేసిన సంగం, నెల్లూరు బ్యారేజీలకు ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం జరగడమన్నది ఎంతో సంతోషకరమైన విషయమని, అలాంటిది నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఆ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండోపంటకు 46 టిఎంసిల నీటిని డెడ్‌స్టోరేజీ దాకా వదిలేసి జలాశయాన్ని ఖాళీచేస్తే ఎలా?.. ఆ తర్వాత ఒకవేళ వర్షాలు కురవకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

### 4.26 లక్షల ఎకరాలకు.. రెండో పంటకు నీళ్ళు...

ఈ ఖరీఫ్‌లో జిల్లాకు రెండో పంట కింద 4,26,565 ఎకరాలకు మొత్తంగా 46 టిఎంసిల సాగునీటిని విడుదల చేయాలని ఐఏబి సమావేశం తీర్మానించింది. మంత్రి కాకాణి అధ్యక్షతన జడ్పీ సమావేశమందిరంలో కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమేరకు నిర్ణయం తీసుకున్నారు. సంగం-నెల్లూరు బ్యారేజీలను జూన్‌లో పూర్తిచేసి, జులైలో ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయించాలని కూడా నిర్ణయించుకున్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## వీక్షణం 52 - మంజీరరెడ్డి

# రోడ్డు... ఉండాలేమో!?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయింది. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' సగర్వంగా జరుపుకుంటున్నాం. ఇన్నేళ్లలో దేశం సాధించిన పురోగతిని వివరించడానికి ఒక పుస్తకం సరిపోదు. రాస్తూ పోతే పుంఖానుపుంఖాలవుతుంది. నిజమే... మూడవ ప్రపంచదేశంగా ఈ 75 ఏళ్లలో మనం అధిరోహించిన సోపానాలు ఒకటి రెండు కాదు... లెక్కలేనన్ని. అభివృద్ధి చెందిన దేశాల రాకెట్‌లను కూడా మనమే అంతరిక్షంలోకి ప్రయోగిస్తున్నాం. ఆయుధాల కోసం విదేశాల మీద ఆధారపడకుండా డిఫెన్స్ రంగంలో స్వయం సమృద్ధి సాధించాం. రాడార్ వ్యవస్థను డెవలప్ చేసుకున్నాం. ఇంత చేసుకున్న మనం ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళ్లడానికి రోడ్డు వేసుకోవడంలో ఎందుకు విఫలమవుతున్నాం? మనిషి జీవికకు కనీస అవసరం అయిన రోడ్డు వేసుకోవడంలో ఇంతటి ఘోరమైన వైఫల్యం ఎందుకు?

### ఈ రోడ్లేమయ్యాయో!

జవహర్ రోజ్‌గార్ యోజన పథకంలో రోడ్లేసుకున్నాం. గ్రామీణ ప్రజలు నగరాలకు వలసలు వెళ్లకుండా, గ్రామాలను అభివృద్ధి పరిచే ఉద్దేశంతో 'మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీమ్' పెట్టి గ్రామాల్లోనే పని కల్పిస్తూ ఉన్నాం. 'ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన' ద్వారా గ్రామాలను కలపాలనుకున్నాం. రోడ్లంటే ఇలా ఏటా ఎండాకాలంలో వేస్తూ వర్షాకాలంలో కొట్టుకుపోయేవి కాదు, ఒకసారి వేస్తే పాతికేళ్లు నిలవాలని సిమెంట్ రోడ్లు వేసుకున్నాం. అంతకంటే ముందు స్వర్ణ చతుర్భుజిలో భాగంగా దేశమంతటినీ కలుపుతూ బ్లాక్ టాప్ రోడ్లు వేసుకున్నాం. తీర నగరం ముంబయి వాళ్లు వర్షానికి పాడుకాని విధంగా సిమెంట్ బెడ్‌తో స్పెషల్ రోడ్లేసుకున్నారు. హైదరాబాద్ నగరంలో కేటీఆర్ ప్రయోగాత్మకంగా వైట్‌టాప్ రోడ్డేశారు. తరచూ నీళ్లు నిలిచేచోట్ల తారురోడ్డుకు బదులుగా ఇంటర్‌లాక్ టైల్స్‌తో రోడ్లేశారు. ఈ ప్రయోగం బాగానే ఉంది. ఈ రోడ్ల మీద స్వదేశీ, విదేశీ కార్లు సుతిమెత్తగా కుదుపులు లేకుండా ప్రయాణిస్తుంటాయి. ఇన్నేసి పనులు ఇంత బాగా చేసుకుంటున్న దేశంలో, ఇంత స్థాయిలో అభివృద్ధిని అందుబాటులోకి తెచ్చుకున్న మనదేశంలో అడవి బిడ్డలు ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళ్లాలంటే రెండు కాళ్లను నమ్ముకోవాల్సిందే. మామూలు మనుషులు కాదు కదా పచ్చి బాలింతలు కూడా కిలోమీటర్ల దూరం నడవక తప్పదు. మరో మార్గం లేదు మరి. అంబులెన్స్ కాదు కదా మూడు చక్రాల ఆటోలు వెళ్లలేవు. ముళ్లు, రాళ్లు రప్పలతో నిండిన కాలిబాటలో నడవాల్సిందే. ఇంత దయనీయమైన స్థితిని వెనుకబాటుకు చిరునామాగా చెప్పుకునే ఏ బీహారుకో అన్వయించుకుంటే పొరపాటే. అది... మన తెలుగు రాష్ట్రంలోనే.

### పొరుగు రాష్ట్రమే

అది తెలంగాణ రాష్ట్రం, ఆసిఫాబాద్-కుమ్రుం భీమ్ జిల్లా, తిర్యాణి మండలంలో ఓ కుగ్రామం. ఆ గ్రామం పేరు గోగిన నాయకపు గూడ. ఆ గ్రామానికి చెందిన నాగమ్మకు నెలలు నిండాయి. ప్రసవం కోసం పక్కనే ఉన్న నిర్మల్ జిల్లాలోని పుట్టింటికి వెళ్లింది. ప్రసవం తర్వాత ఐదు రోజులకే బిడ్డతో అత్తగారింటికి వచ్చి పురిటి స్నానం చేయడం వాళ్ల ఆనవాయితీ. నాగమ్మ తప్పకుండా తన అత్తగారింటికి చేరాల్సిందే. తన జిల్లాలోని బాలాన్స్‌పూర్ వరకు రోడ్డు ఉంది. అక్కడి నుంచి తన ఊరు గోగిన నాయకపు గూడ పదికిలోమీటర్ల దూరాన ఉంది. పచ్చి ఒంటితో బంధువుల ఆసరాతో అడుగులో అడుగు వేస్తూ పదికిలోమీటర్లు నడిచి తన ఇంటికి చేరింది. దారుణాతిదారుణాల్లో ఇది ఒక దారుణం. సంపన్న వర్గాలు నివసించే కాలనీలకు రోడ్లు వేయడం మీద ఉండే ఆసక్తి ఇలాంటి మారుమూల ప్రాంతాల మీద ఉండకపోవడాన్ని ఏమనాలి?

### ఉద్యోగస్వామ్యం మాయ

ఇది ఇలా ఉంటే... మన ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సోమవారం నాటి సమీక్ష సమావేశంలో రోడ్ల నిర్మాణం, మరమ్మత్తుల మీద ప్రత్యేకదృష్టి పెట్టారు. 'ఇప్పటికే చాలాచోట్ల రోడ్ల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తామ'నే భారీ హామీతో సీఎంను సంతృప్తి పరిచేశారు అధికారులు. కోట్లాదిరూపాయలు రోడ్లపాలవుతుంటాయి. అధికారుల లెక్కల్లో రోడ్లుంటాయి. నేల మీద ప్రయాణించే పాదచారికి, వాహనదారులకు మాత్రం రోడ్డు కనిపించదు, ఇదే అసలైన మాయాజాలం. 'భారతీయుడు' సినిమాలో సీనియర్ కమల్‌హాసన్ అవినీతి మీద పోరాడుతుంటాడు, జూనియర్ కమల్‌హాసన్ అవినీతితో బతికేస్తుంటాడు. 'దేశమంతటినీ ప్రక్షాళన చేయబూనాను, కానీ నా కాళ్ల కింద ఉన్న కలుపు మొక్కను గుర్తించలేకపోయాను' అంటాడు సీనియర్ కమల్ ఆ సినిమాలో. ఉద్యోగిస్వామ్యం పనితీరు కూడా అలాగే ఉంటోంది. 'మన పరిపాలనలో అంతా బాగుంది ప్రభూ!. ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా జీవిస్తున్నారు' అని చెప్పే తీపి గుళికల వంటి మాటలే పాలకులకు రుచిస్తాయి. పాలకులను ఆ భ్రమలో ఉంచడానికే అధికారగణం ప్రయత్నిస్తుంటుంది. అది నాటి రాజరికమైనా! నేటి ప్రజాస్వామ్యమైనా!!

### ఇంత దూరమేల!

నాగమ్మ నివసిస్తున్నటువంటి కుగ్రామాలకు వెళ్లాల్సిన అవసరం రాకనే పాలకులకు పదవీకాలం ముగుస్తుంటుంది. ఒకవేళ ప్రకృతి విపత్తులు సంభవించి వెళ్లాల్సి వచ్చినప్పటికీ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయిందనే అభిప్రాయాన్ని నమ్మకంగా కల్పిస్తుంది ఇదే అధికార గణం. పాలన మాయాజాలం అంటే ఇదే. ఇది పాలకులకు కూడా అంతుబట్టని మాయ ఇది. వాస్తవం పాలకులకు తెలిసేదెన్నడో? డిజిటల్ యుగంలో కూడా పాలకులకు పాలితులకు మధ్య దూరమా! సీఎంవో ఒక వాట్సాప్ నంబర్‌ను విడుదల చేస్తే చాలు... సామాన్యులు వాళ్ల ఊరి రోడ్లను ఫొటో తీసి పంపుతారు. ఏదో ఒక ఆలోచన చేయండి మహాప్రభూ!

# నాగవరపమ్మ అమ్మవారికి.. విశేష పూజలు

సంగం మండలం కోలగట్ల గ్రామంలో వెలిసివున్న గ్రామదేవత నాగవరపమ్మ అమ్మవారికి ఈనెల 1న విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు అమ్మవారికి ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేసి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. చుట్టుపక్కల అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



# విద్యార్థులకు పుస్తకాల బహూకరణ

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని గాంధీజీ ఆశ్రమంలో ఈనెల 1న పాఠశాల విద్యార్థులకు నిర్వాహకులు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సర్వమత ప్రార్థనలు చేశారు. నీటి పారుదల శాఖ రిటైర్డ్ ఎస్ఇ కె.వెంకటరమణ, నెల్లూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొని ఆశ్రమంలోని గాంధీజీ విగ్రహానికి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ విగ్రహానికి నూలుమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమ కమిటీ సభ్యులు మంజుల, పివి వెంకటశేషయ్య, పల్లిపాడు గ్రామ సర్పంచ్ రెడ్డిపోగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 'వనం ఫౌండేషన్' సేవలు భేష్

నెల్లూరు పొదలకూరురోడ్డులో ఉన్న వనం ఫౌండేషన్ వారి సామాజిక సేవలు అభినందనీయమని నగర మేయర్ పొట్లూరి స్రవంతి ప్రశంసించారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఈనెల 2న మేయర్ ప్రారంభించారు. కార్పొరేటర్ కరణం మంజుల, సుబ్బారెడ్డి, ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# రవి సన్నారెడ్డికి గౌరవ డాక్టరేట్

## మే 24న నెల్లూరులో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ప్రదానం చేయనున్న ఆంధ్రా గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్



'శ్రీసిటీ' ప్రత్యేక పారిశ్రామికవాడ సహ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మకంగా అందించే గౌరవ డాక్టరేట్‌కి ఎంపిక చేయబడ్డారు.

ఆంధ్రా తమిళనాడు సరిహద్దులో 'శ్రీసిటీ' వేదికగా పారిశ్రామిక విప్లవానికి శ్రీకారంచుట్టి, ప్రపంచ పారిశ్రామిక రంగంలో భారతదేశానికి తద్వారా ఆంధ్రప్రదేశ్‌కి, ప్రత్యేకంగా నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు గుర్తింపు తీసుకొచ్చిన యువ పారిశ్రామికవేత్త రవీంద్ర సన్నారెడ్డి. ఆయన సారధ్యంలో వందలాది విదేశీ పరిశ్రమలు శ్రీసిటీకి తరలివచ్చాయి. వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభించాయి. భారత దేశంలోనే అత్యంత సౌకర్యవంతమైన పారిశ్రామికవాడగా శ్రీసిటీ గుర్తింపును సాధించింది. రవి సన్నారెడ్డి కృషికి గుర్తుగా విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఆయనను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించబోతోంది. మే24వతేదీన నెల్లూరులో అత్యంత ఆడంబరంగా జరగబోయే స్నాతకోత్సవ వేడుకలో రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఈ డాక్టరేట్‌ను రవిరెడ్డికి ప్రదానం చేస్తారు.

# మీరే సైన్యం... మీరే మా ధైర్యం

## మీతోనే అడుగులు.. అప్పుడే ప్రగతికి పరుగులు - విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన 'రామ్'

*'మీరే సైన్యం..మీరే మా ధైర్యం. మీతోనే మా అడుగులు..అప్పుడే సమాజంలో అభివృద్ధికి పరుగులు' అంటూ యువనాయకుడు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ రామ్‌కుమార్‌రెడ్డి విద్యార్థిలోకానికి సరికొత్త స్ఫూర్తిని అందించారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి మీరే పునాదులంటూ దిశానిర్దేశం చేసి అందరిలో చైతన్యం నింపారు. మంచిపాలనకు విద్యార్థులు బాసటగా ఉండాలని, అందుకే విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ 'కమ్యూనిటీ డెవలప్‌మెంట్-త్రూ ఎడ్యుకేషన్' అనే పేరుతో ప్రభుత్వం మీ ముందుకు వస్తోందన్నారు. రామ్‌కుమార్‌రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు సారధి అయ్యాక నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో తొలిసారిగా ఈనెల 4న పెద్దఎత్తున జరిగిన సమావేశంలో పాల్గొని ఆయన స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు.*





పరిపాలన సజావుగా జరగాలంటే, సమాజం ప్రగతిపథంలో సాగాలంటే విద్యార్థిలోకం ఎంత కీలకమో తెలిసిన విద్యావేత్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విద్యార్థిలోకానికి తనదైన శైలిలో మార్గదర్శనం చేశారు. నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు), స్టేట్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు త్రూ ఎడ్యుకేషన్(బిసిడిఇ) సంయుక్త ఆధ్వర్యంలో 'పరిపాలన వికేంద్రీకరణ-పాలన సౌలభ్యం'పై జరిగిన చర్చావేదికలో రామ్‌కుమార్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో లోటుపాట్లను, ప్రజల జీవనస్థితిగతులను ఎప్పటికప్పుడు విద్యార్థుల ద్వారా తెలుసుకుంటూ, సమస్యలను చక్కదిద్దుకుంటూ సమన్వయంతో ముందుకు సాగినప్పుడే సమాజం ప్రగతిపథంలో రాణిస్తుందని, అందుకు విద్యార్థులంతా తమ సేవలందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులే సైన్యంగా.. సమాజ ప్రగతే ధ్యేయంగా.. ప్రజల అభ్యున్నతే పరమావధిగా అందరం కలిసి ముందుకు సాగుదామంటూ విద్యార్థిలోకానికి ఆయన దిశానిర్దేశం చేశారు.

ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటుచేయడం శుభపరిణామమని ఈ చర్చావేదికలో పాల్గొన్న విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి కొనియాడారు. ఈ బోర్డు ఏర్పాటు వల్ల యువతకు మంచి భవిష్యత్తు లభిస్తుందని, అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా భావితరాలకు మంచి జరిగేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపి ఫీజ్ రెగ్యులేటరీ కమిటీ సభ్యులు ఆచార్య వి.నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ కల్పన జరగాలంటే పరిపాలన వికేంద్రీకరణ తప్పనిసరి అని విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్ విజయ కృష్ణారెడ్డి అన్నారు. ఈ చర్చావేదికలో కృష్ణచైతన్య విద్యాసంస్థ కరెస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, విఎస్‌యు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజా ఎస్ నాయర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఉదయ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మంటగలిసిన మానవత్వం

*రానురాను మానవత్వం మంటగలిసిపోతోంది. భర్త చనిపోయి ఆ భార్య అల్లాడుతుంటే, డబ్బులిస్తేనే తప్ప పోస్టుమార్టం చేసేది లేదంటాడు ఓ ప్రభుత్వ డాక్టర్!.*

*'బిడ్డ చచ్చిపోయాడయ్యా..శవాన్ని ఇంటిదాకా తీసుకురాండి బాబూ'..అని వాహనాల వారిని వేడుకుంటే ఒక్కరూ రారు. 'శవమైతే మేం రాం'!.. అంటూ నిర్దాక్షిణ్యంగా వెళ్లిపోతున్నారు. మృతదేహాల పట్ల కూడా కనికరం లేని ఇంత దయలేని దృశ్యాలను చూస్తుంటే మనుషుల్లో మానవత్వం చచ్చిపోయిందా.. అనిపిస్తుంది.*

ఎక్కడో పశ్చిమగోదావరి జిల్లాలోని ఓ పల్లె నుంచి వలసకూలీలైన ముదిరాజు, మునీశ్వరి దంపతులు తమ ఇద్దరు పిల్లలతో పొట్టకూటి కోసం నెల్లూరుజిల్లాకు వచ్చారు. చేసిన అప్పులు ఇక తీర్చలేమేమోనని దిగులుతో ముదిరాజు ఈనెల 4న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉదయగిరి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తే అక్కడ పనిచేస్తున్న ఓ డాక్టర్ ఏమాత్రం జాలి దయ అన్నదే లేకుండా తనకో 15వేలు, అటెండర్‌కో వెయ్యి.. మొత్తం 16వేలిస్తే తప్ప పోస్టుమార్టం చేసేదే లే.. అంటూ తెగేసిచెప్పాడు. తాము పేదోళ్ళమని, ఎలాగో 8 వేలు ఇస్తామని బాధితురాలు వేడుకున్నా ఆ డాక్టర్ ఒప్పు కుంటేగా?.. ఎలాగో ఆమె డబ్బులు పోగుచేసి ఆ డాక్టర్ చేతిలో పెట్టింది. ఇదంతా ఎవరో వీడియో తీసి సోషల్‌మీడియాలో పెట్టేసరికి ఈ ఉదంతం బట్టబయలైంది. అధికారులు స్పందించి ఆ డాక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేశారు.

## మృతదేహమా?.. అయితే మేము రాం!



నెల్లూరు జిల్లా సంగం లో ఈ నెల 4న జరిగిన మరో అమానవీయ సంఘటన ఇది. తమ పదేళ్ళ బిడ్డ ఈశ్వర్ ప్రమాదవ శాత్తూ కాలువలో పడి మరణిస్తే... ఆ మృతదేహాన్ని ఆసుపత్రి నుండి ఇంటికి తీసుకువెళ్ళేందుకు ఆటోల వారిని, ఇతర వాహనాల వారిని ఎంతగా బతిమాలినా ఎవరూ కనికరించలేదు. 108 వాహనం వారిని అడిగితే మృతదేహాలను తీసుకువెళ్ళేందుకు తమకు అనుమతి లేదన్నారు. చివరికి బంధువుల్లో ఒక వ్యక్తి ఆ మృత దేహాన్ని భుజానవేసుకుని మోటార్‌బైక్ మీద పెట్టుకుని ఇంటికి తీసుకువెళ్ళాల్సి వచ్చింది.



## పల్లె దాహం తీరుస్తున్న...

# అపర భగీరథుడు.. విపిఆర్

అసలే మండే ఎండాకాలం. నాలుక పిడచకట్టుకుపోతున్నా గుక్కెడు మంచినీళ్ళు దొరకని గ్రామాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. బిందెలు, కుండలు చేతపట్టుకుని ఎంతెంతో దూరం పొలాల్లో నడుచుకుంటూ వెళ్ళి వ్యవసాయ బావుల వద్ద నీళ్లు తెచ్చుకుంటున్న మహిళల బాధ వర్ణనాతీతం. ఎంతోకాలంగా పల్లెప్రజలు పడుతున్న ఈ కష్టాలను గ్రహించిన రాజ్యసభ సభ్యుడు, సేవాభూషణుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పల్లెల దాహం తీర్చేందుకు సంకల్పించి, విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 'విపిఆర్ అమృతధార' పథకానికి శ్రీకారం చుట్టారు. కోట్లాదిరూపాయలను వ్యయంచేస్తూ గ్రామీణులకు తాగునీటిని అందించే వాటర్‌ప్లాంట్‌లను శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటుచేస్తూ వారి దాహార్తిని తీరుస్తూ 'అపర భగీరథుని'గా ఆయన ప్రజలందరి చల్లని దీవెనలందుకుంటున్నారు.

ఈనెల 5వ తేదీన ఆత్మకూరు నియోజకవర్గంలోని మారుమూల గ్రామమైన పాతాళపల్లిలో ప్రజలకు మంచినీటి ప్లాంట్‌ను ఏర్పాటుచేయడంతో అక్కడి ప్రజలంతా విపిఆర్ సేవలను కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఇప్పటిదాకా 'అమృతధార' పథకం కింద 102 వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటుచేశామని, గ్రామీణప్రాంత ప్రజలకు మంచినీటి సౌకర్యాన్ని అందజేయడం, లక్షలాదిమంది ప్రజల దాహార్తి తీర్చడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఈ గ్రామంలో మంచినీటి ప్లాంట్ ఏర్పాటుచేయాలని గతంలో తనతో చెప్పారని, ఈరోజు ఆయన మనమధ్య లేకున్నా.. ఇప్పుడిక్కడ వాటర్‌ప్లాంట్ ఏర్పడడంతో ఆయన ఆత్మ ఎంతగానో సంతోషిస్తుందని అన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 19, అనంతసాగరం మండలంలో 3 వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ బిజవేముల ఓబుల్‌రెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ ప్రతినిధి ఆచార్య నారాయణరెడ్డి, పెంచలరెడ్డి, శంకర్, రాజేశ్వరరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, జడ్పీటిసి వెంకటసుబ్బారెడ్డి, ఎంపిపి సంపూర్ణమ్మ, పిచ్చిరెడ్డితో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

# నిస్వార్థ.. నిష్కల్మషతత్వం గణపం ఓబులరెడ్డిది!

## నాలుగవ వర్ధంతి సందర్భంగా సంస్మరించుకున్న గ్రామ ప్రజలు



తాను నమ్మిన సిద్ధాంతంతో ముక్కుసూటిగా వెళ్ళే నిస్వార్థ, నిష్కల్మష మనస్తత్వం తన చిన్నాన్న, విడవలూరు పెద్దాయన గణపం ఓబులరెడ్డిది అని ఓబులరెడ్డి అన్న కుమారుడు, విడవలూరు జడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి అన్నారు. ఓబులరెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా విడవలూరులోని జెబికెఆర్ ఎస్టీ కాలనీ-1, ఎస్టీ కాలనీ-2లో ఉన్న ప్రాథమిక పాఠశాలలలో చదువుకుంటున్న నిరుపేదలైన 70 మంది విద్యార్థినీవిద్యార్థులకు నూతన వస్త్ర బహుకరణ, అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఓబులరెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డితో పాటు విడవలూరు సర్పంచ్ సుజన, మండల ఉపాధ్యక్షులు అనంగి రమణయ్య, వార్డు సభ్యురాలు అంకోజమ్మ, పీసీసీ సభ్యుడు మద్దూరు రాజగోపాలరెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మానందరెడ్డి, పంగా రమణయ్య, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బంది, ఎంఇఓ కార్యాలయ అధికారులు, గ్రామ ప్రముఖులు పాల్గొని ఓబులరెడ్డిని సంస్మరించుకున్నారు.



లాయర్
మే 06, 2022

# 'ఇసుక'ంటే.. అ(న)లుసా?

**ఎక్కడైనా సులభంగా దొరికేదే కదా.. అని ఇసుకను ఒక నలుసుగానో.. ఇక అలుసుగానో తీసుకోవడం ఎంతమాత్రం కుదరదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఏ నదుల్లోనో, సముద్రతీరాల్లోనో తవ్వి తీసుకుంటే దొరికిపోయే ఇసుక, రానున్న రోజుల్లో ఇక 'దొరికేదే లే' అన్నా ఆశ్చర్యపోక తప్పదంటున్నారు నిపుణులు. ప్రపంచ వ్యాప్తంగా అనేకదేశాల్లో ఎవరిష్టప్రకారం వారు ఇసుకను యథేచ్ఛగా తవ్వేయడం వల్ల ఈ భూమండలానికే పెద్ద ప్రమాదం వస్తుందని హెచ్చరిస్తున్నారు. మానవాళి మేలుకోకుంటే ముప్పు తప్పదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.**

ఎక్కడైనా సులభంగా దొరికేదే కదా.. అని ఇసుకను ఒక నలుసుగానో.. ఇక అలుసుగానో తీసుకోవడం ఎంతమాత్రం కుదరదు. ఇసుకే కదా.. అని ఇష్టం వచ్చినట్లు వాడేసుకుంటే, భవిష్యత్తులో అదే ఒక పెద్ద సంక్షోభమై చుట్టుముడుతుందని, ప్రపంచం త్వరలోనే మరో పెద్ద ముప్పును ఇసుక కొరత రూపంలో చవిచూడబోతోందని నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. అక్రమ తవ్వకాలు ఆపకపోతే భవిష్యతులో ఈ భూమండలం మీద ఇక ఇసుకన్నదే కనిపించదంటున్నారు. ఇసుక వినియోగంతో పాటు అక్రమతవ్వకాలు విపరీతంగా పెరిగిపోతున్న నేటి రోజుల్లో.. ఈ ముందస్తు హెచ్చరికలు ఎంతో ముఖ్యమైనవిగా గుర్తించాల్సి ఉంది. ఈ దుస్థితులు ఇలాగే కొనసాగితే ఇసుక కొరత కూడా తీవ్రంగా ఏర్పడి, ఇసుకంటే ఒక అపురూపమైన పదార్థంగా చూడాల్సిన రోజు దగ్గరలోనే ఉంటుందంటున్నారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఏ కాలువల్లోనో, నదుల్లోనో, సముద్రతీరాల్లోనో తవ్వి తీసుకుంటే దొరికిపోయే ఇసుక, రానున్న రోజుల్లో ఇక 'దొరికేదే లే' అన్నా ఆశ్చర్యపోక తప్పదంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇసుక కొరత ముంచుకొస్తోందని, మానవాళి మేలుకోకుంటే అతిపెద్ద ప్రమాదం తప్పదని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (యుఎన్ఇపి) తన తాజా నివేదికలో హెచ్చరిస్తుండడం గమనార్హం. ఈ భూమ్మీద ఇసుక ఏర్పడడానికి వందలు వేల సంవత్సరాలు పడుతుంది. భౌగోళిక ప్రక్రియల ద్వారానే మట్టి, ఇసుక వగైరాలన్నీ ఏర్పడతాయని, శిలలు క్రమేణా కరిగిపోయి ఇసుకగా అవతరిస్తుందని, సముద్రాల్లో అలల ప్రభావంతో ఇసుక ఏర్పడుతుందన్నది శాస్త్రవేత్తల మాట. ఈ ఇసుక వల్ల భూమికి, ఈ భూమిమీద పుట్టిన మనిషికే కాక సకల జీవరాశులకు ఎన్నో ఉపయోగాలున్నాయి. అసలు, భూమి పటుత్వం తగ్గకుండా, కోతకు గురికాకుండా ఉండేది ఇసుక వల్లనే. అంతేకాదు, వరదల నుంచి రక్షణగా నిలిచేది కూడా ఇసుకే. పర్యావరణ సమతుల్యతను, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర కూడా ఇసుకదే. అయితే భూమ్మీద ఎంతో ముఖ్యమైన పదార్థంగా, ప్రకృతి మనకు ప్రసాదించిన ఒక గొప్ప వరంగా ఉన్న ఇసుకను కొద్దికాలంలోనే విచ్చలవిడిగా తవ్వేస్తుండడం వల్ల భవిష్యత్తులో కొరత తప్పదని అంటున్నారు నిపుణులు. ఇది ప్రకృతి వనరుల పట్ల నేటి ఆధునిక మానవుడి నిర్లక్ష్యానికి నిదర్శనమని, దీంతో భావితరాల వారికి ఇసుక దొరకడం గగనమవుతుందని వారి ఆందోళన. ఇసుక వాడకంపై ప్రభుత్వాల ఆజమాయిషీ లేకపోవడంతో చాలా దేశాల్లో ఇసుక అక్రమతవ్వకాలు జోరుగా పెరుగుతున్నాయని, ఇప్పటికైనా ఈ తవ్వకాలపై పటిష్టమైన చర్యలు తీసుకోకుంటే ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడమేనని ఆ నివేదిక పేర్కొంటోంది. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా నిర్మాణరంగంలో ఇసుక వాడకం బాగా పెరిగిపోయింది. ఎడారుల్లో విస్తారంగా ఇసుక ఉన్నా అది నిర్మాణరంగానికి సరిగా అతకదు కనుక నదులు, సాగరతీరాల్లో ఇసుక తవ్వకాలకు దిగుతుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఇళ్ళ నిర్మాణాలు వగైరాల కోసం విచ్చలవిడి తవ్వకాలతో నదులు, సముద్రతీరాలు ధ్వంసం కావడమే కాక చిన్న ద్వీపాలు సైతం కనుమరుగవుతున్నాయని, కనుక సముద్ర తీరాల్లో ఇసుక తవ్వకాలను వెంటనే పూర్తిస్థాయిలో నిషేధించాలని ఆ నిపుణుల నివేదిక సూచిస్తోంది. నేలతల్లి మనుగడకు, తద్వారా సకలజీవుల ఆవాసానికి ఎంతో ముఖ్యమైన ఇసుకను దుర్వినియోగం చేసుకుంటే పర్యవసానాలు క్లిష్టంగా తయారవుతాయనే శాస్త్రవేత్తల హెచ్చరికను ఎవరూ పెడచెవిని పెట్టకూడదు. మనదేశంలోనూ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరిగిపోతూనే ఉన్నాయి. దేశంలోని కొన్నిప్రాంతాల్లో ఇసుకను అమ్ముకుని కోటానుకోట్ల లాభాలు ఆర్జించడం ఇటీవలికాలంలో ఎక్కువైంది. అందుకు తగ్గట్టుగా ఇసుక మాఫియాలు కూడా రంగంలోకి వచ్చేశాయి. ఇసుక అమ్మకపు వస్తువుగా మారిపోయింది. విచ్చలవిడి తవ్వకాల వల్ల పర్యావరణ సమతుల్యానికి ఎంతగా ఇబ్బంది ఏర్పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాలు గట్టిగా చర్యలు తీసుకుంటే తప్ప ఈ అక్రమ తవ్వకాలు ఆగవు. ఇసుక అవసరమైన వారికి ఎంత అవసరమో అంతమాత్రమే సముచితమైన ధరకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. పర్యావరణం.. మానవ మనుగడకు ప్రాణం. దానికే ముప్పు తెచ్చే ఎలాంటి చర్యలనైనా నివారించాల్సిందే. అందులోనూ ప్రకృతి వనరులను దోపిడీ చేయడం మరింత దారుణం. అలాంటి అక్రమాలను ప్రభుత్వాలు గట్టిగా అడ్డుకోకుంటే ఆ తర్వాత ఎవరూ చేయగలిగిందేమీ ఉండదని వేరే చెప్పనక్కర లేదు.

## అస్తవ్యస్తంగా నగర పార్కింగ్



నెల్లూరు నగరంలో రోజురోజుకీ జనాభా సంఖ్య పెరిగిపోతూ ఉంది. పెరుగుతున్న జనాభాకి తగ్గట్లుగా నగరం కూడా విస్తరిస్తోంది. అందుకు తగ్గట్లుగా వ్యాపార సముదాయాలు, వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. గతంలో అయ్యప్ప గుడి నుండి ఆత్మకూరు బస్టాండు వరకూ ఒకటే రోడ్డు ఉండేది. మధ్యలో గాంధీబొమ్మ సెంటర్ నుండి ఏసీ బొమ్మ వరకు వ్యాపారాల

### సమస్యల తో 'రణం'

కేంద్రంగా ట్రంకురోడ్డు అభివృద్ధి చెందింది. అదే ట్రంకురోడ్డుకి కుడి ఎడమ వీధులలో కాపు వీధి, లస్సీ సెంటర్ వంటి అనేక వ్యాపార ప్రాంతాలు ఏర్పడ్డాయి. అయితే, దశాబ్దాల కాలంగా రోడ్లు మాత్రం అంతే వెడల్పు కలిగున్నాయి. ఇప్పుడు కొత్తగా మినీబైపాస్ రోడ్డు అభివృద్ధి చెందుతోంది. ఎటుచూసినా భారీ వ్యాపార సముదాయాలు వస్తున్నాయి తప్ప, అందుకు తగ్గ పార్కింగ్ వసతి కరువైపోయింది. ఎక్కడచూసినా వాహనదారులు అడ్డదిడ్డంగా తమ వాహనాలను ఆపేస్తున్నారు. ముఖ్యంగా అనేక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ జాయింట్లు ఇబ్బడిముబ్బడిగా తెరచుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఎక్కడపడితే అక్కడ తమ మోటారుసైకిళ్లను, స్కూటర్లను నిలిపేస్తున్నారు. ఒకవైపు అదుపులేని ఆటోరిక్షాలు, మరోవైపు శరవేగంగా దూసుకువెళ్తున్న కార్లు, వీటిమధ్యలో బిక్కుబిక్కుమంటూ నడుస్తున్న పాదచారులు... ఇదీ నగర పరిస్థితి.

కొత్తగా నిర్మిస్తున్న చాలా భవనాలలో సెల్లార్‌లో పార్కింగ్ ఉన్నట్లుగా చూపించి మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం నిర్మాణాలు సాగిస్తున్నారు. కానీ సెల్లార్‌ని గోడౌన్‌లకు పరిమితం చేస్తున్నారు తప్ప, పార్కింగ్ కోసం వాడుకోవడం లేదు. ముఖ్యంగా నగరంలో ఉన్న 90శాతం కళ్యాణ మండపాలకు, ఫంక్షన్‌హాళ్లకు అసలు పార్కింగే లేదు. పెళ్ళిళ్ళు ఇతర ఫంక్షన్లు జరిగే సమయాలలో అయితే నగరవాసులకు నరకమే. నగరంలో అనేక ప్రధాన కూడళ్లలో పెయిడ్ పార్కింగులకు అవకాశం ఉంది. కానీ నగర కార్పొరేషన్ అధికారులు ఎందుకనో వాటిపై దృష్టి పెట్టడంలేదు. ఇది మా పని కాదు పోలీసుశాఖ బాధ్యత అని నెపం పెట్టి నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు నిఘాపెట్టి నిర్మాణాలు సరిగా జరిగేలా చూడడమే కాకుండా, పెయిడ్ పార్కింగ్ స్థలాలను ఏర్పాటుచేస్తే తమ డ్యూటీ తాము చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పోలీసు ట్రాఫిక్ విభాగం అంటోంది. ఈ రెండు శాఖలూ ఏకమై పార్కింగ్ వసతి చూపించని షాపు యాజమాన్యాలతో పాటు అక్రమపార్కింగ్ దారులపైన కూడా భారీ జరిమానాలతో కొరడా ఝుళిపిస్తే తప్ప మార్పు రాదు. ఆ దిశగా వారు ఆలోచిస్తే మంచిది.

- సంచారి

## సొంతూరుపై మన వెంకయ్య మమకారం

నెల్లూరీయులు ప్రపంచస్థాయిలో ఎక్కడ ఏ రంగంలో ఘనత సాధించినా, సాధిస్తున్నా, వాళ్ళని 'మన నెల్లూరీయుడు' అని సంబోధిస్తున్న మన 'లాయర్'కి ముందుగా నా అభినందనలు. ఇటీవల మూడు రోజులపాటు జిల్లాలో మకాంవేసిన గౌరవ భారత ఉపరాష్ట్రపతివర్యులు అల్లూరులో దేవిరెడ్డి కుటుంబం నెలకొల్పిన సేవాలయాన్ని ప్రారంభించడంతో పాటు నెల్లూరులో ఆల్‌ఇండియా రేడియోస్టేషన్‌ని జాతికి అంకితం చేశారని చదివి సంతోషించాను. వెంకయ్యనాయుడు ఏ పదవిలో ఉన్నా జిల్లా అభివృద్ధి విషయంలో చొరవ చూపుతూనే ఉన్నారు. 'కన్నతల్లిని, మాతృభాషని, జన్మభూమిని మర్చిపోయినవాడు మనిషే కాదు' అని తరచూ చెప్పే నాయుడుగారు నెల్లూరు అభివృద్ధిలో తనవంతు సహాయసహకారాలను అందిస్తూ జన్మభూమిపై తన మమకారాన్ని చూపిస్తున్నారు. సేవే పరమావధిగా దేవిరెడ్డి కుటుంబం అల్లూరు ప్రాంతంలో నిర్మించిన దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించడం కోసం ఎంతో శ్రమ తీసుకుని, నెల్లూరు నుండి అల్లూరు వరకు రోడ్డు మార్గాన ప్రయాణించి వెళ్ళడంలోనే వెంకయ్యగారికి సేవారంగం పట్ల ఉన్న మక్కువ అర్థమవుతుంది. తాను ఏ హోదాలో ఉన్నా నెల్లూరుకు వస్తే నేను మీవాడిగానే ఉన్నానని నిరూపిస్తున్న ఉపాపతికి అభినందనలు.

వై.నారాయణరెడ్డి, చికాగో, యు.యస్.ఏ.

## రోడ్డా!.. మురుగు కాలువా?...



నెల్లూరు నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో అనేకప్రాంతాల్లో మురుగు నీరంతా రోడ్లమీదకు వచ్చి మడుగులు కడుతోంది. టెక్కేమిట్ట లోని రైల్వే అండర్‌బ్రిడ్జ్ వద్ద పావని హోమ్ అపార్ట్‌మెంట్స్ పక్కనున్న చర్చికి ఎదురుగా మురుగునీరంతా రోడ్లపై పారుతోంది. ఇక్కడ కొత్తగా హోటల్స్ వచ్చినప్పటినుంచి ఈ సమస్య మొదలైంది. రోడ్లు ఇలా మురుగు కాలువలైతే ఎలా? కార్పొరేషన్ వారు ఈ సమస్యను పరిశీలించి రోడ్లపై మురుగునీరు చేరకుండా చూడాలి.

రఘురామకుమార్, నెల్లూరు

### డబ్బులిచ్చాం, ఇంకా ఇస్తాం.. ఓట్లేస్తారు... అని
## ముఖ్యమంత్రే చెప్పడం ఏంటి...?




ఏ ప్రభుత్వమైనా తాము అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన అభివృద్ధి గురించి చెప్పుకుంటారు. తమ పాలనలో సాధించిన పారిశ్రామిక ప్రగతి, తాము కొత్తగా నిర్మించిన నీటిపారుదల ప్రాజెక్టులు, వేసిన రోడ్లు, ఇచ్చిన ఉద్యోగాలు, ధరల నియంత్రణ, అవినీతి నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజాసంక్షేమం కోసం తమ ప్రభుత్వం చేపట్టిన జనరంజక పథకాలు(ఉదాహరణకు ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటివి) గురించి ప్రచారం చేసుకుంటారు. కానీ, ఇటీవల ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడిన తీరు విడ్డూరంగా ఉంది. ఉచిత పథకాల ద్వారా నేరుగా ప్రజల అకౌంట్లలోకి తాము ఇప్పటికే 1.37 లక్షల కోట్లు బదిలీ చేశామని, రానున్న రెండేళ్లలో మరో 1.10 లక్షల కోట్లు వారి ఖాతాలో జమ చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదం. డబ్బులిచ్చాం కాబట్టి ప్రజలు మళ్ళీ తమకే ఓట్లేసి తీరాల్సిందేనని సాక్షాత్తూ ముఖ్యమంత్రే అనడం ఆయనకే చెల్లింది. ఇలా ఓట్ల కోసం రాష్ట్రాల భవిష్యత్తును ముఖ్యమంత్రులు తాకట్టుపెట్టుకుంటూ పోతే దేశ భవిష్యత్తు ఊహించుకోవడానికే భయమేస్తోంది. ఇలా అనుచితంగా ఉచితాలు ఇచ్చుకుంటూ వెళ్ళడం ఎంతవరకూ సముచితమో..? ప్రభుత్వాధినేతలు ఆలోచించుకోవాలి...!

ఆర్. విశ్వేశ్వరరావు, హైదరాబాదు.

## నేతలు మారితే మంచిదే...

రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, రూరల్ శాసనసభ్యులు శ్రీధర్‌రెడ్డి చేస్తున్న ప్రజాబాటకు సంఘీభావం తెలపడం స్వాగతించతగ్గ పరిణామం. ప్రభాకరరెడ్డి స్వయంగా వెళ్ళి రూరల్ నియోజకవర్గంలోని గడపగడపకి శ్రీధర్‌రెడ్డితో కలిసి నడవడం వల్ల రూరల్ నియోజకవర్గ ప్రజలలో వైసీపీ పట్ల ఒక భరోసా ఏర్పడడంతో పాటు నమ్మకం కూడా కలుగుతుందని నా అభిప్రాయం. విపిఆర్ లాంటి నిస్వార్థ సమాజ సేవకులు ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చి ప్రజాక్షేత్రంలో పర్యటిస్తే ప్రస్తుత రాజకీయాలపట్ల, రాజకీయ నాయకుల పట్ల ప్రజలలో ఉన్న చులకనభావం కొంతైనా తగ్గుతుంది.

ఇక సర్వేపల్లి ఎంఎల్ఏ కాకాణి గోవర్ధనరెడ్డి కూడా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత చాలావరకు మారినట్లుగా కనిపిస్తున్నారు. ఎదిగేకొద్దీ ఒదగాలన్న సూత్రాన్ని పాటిస్తూ తానే అందరి నాయకుల ఇళ్లకు వెళ్ళి కలుస్తుండడం ఆయనలో వచ్చిన మార్పుకి నిదర్శనం. లోలోపల ఎన్నున్నా బయటకు మాత్రం తామంతా ఒకటే అన్న సందేశాన్ని ఇస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి మూడేళ్లు ఎడమొహం పెడమొహంగా ఉన్న జిల్లా నేతలు ఇప్పటికైనా తాము ఒక్కతాటిపై నడిచి పార్టీని మళ్ళీ అధికారంలోకి తీసుకొస్తాం అన్న సంకేతాలను ఇవ్వడం శుభసూచకం.

రవీంద్రరెడ్డి కాకుటూరు, మైపాడు.

### 'నవరత్నాల'తోనే....
# పేదల జీవితాలకు వెలుగు
**కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న**




రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అమలుచేస్తున్న 'నవరత్నాల' పథకాలతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేసేందుకు ఈ మూడేళ్ళ కాలంలో ముఖ్యమంత్రి దేశంలోనే కనీవినీ ఎరుగనివిధంగా లక్షా 37వేల కోట్ల రూపాయలు విడుదలచేసి ఆదర్శ ముఖ్యమంత్రిగా అందరి ఆశీస్సులు అందుకుంటున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 2న ఆయన కొడవలూరు మండల పరిషత్ కార్యాలయంలో 3వ విడత సున్నావడ్డీ చెక్కులను అర్హులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రెండేళ్ళలో సంక్షేమ పథకాల కోసం ముఖ్యమంత్రి మరో లక్షా 10 కోట్లు వెచ్చించనున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళల అభ్యున్నతికి, బడుగు బలహీనవర్గాల వారి అభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి, అందజేస్తున్న సంక్షేమ పథకాలు అపూర్వమన్నారు. అనంతరం ఆయన గిరిజనుల కోసం ఐటిడిఏ ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. తొలుత కొడవలూరు పొదుపు సంఘాలకు కోటీ 73 లక్షలు, విడవలూరు సంఘాలకు కోటీ 44 లక్షల రూపాయల నమూనా చెక్కులను అందజేశారు. డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, జడ్పీటిసి సరోజనమ్మ, మండల కన్వీనర్ వెంకటశేషయ్య, ఏపిఎం రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

# చెక్క నగిషీ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తాం
**--- ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి హామీ ---**

ఉదయగిరిలో ఉన్న అపూర్వమైన చెక్క నగిషీ కేంద్రం రాష్ట్రవ్యాప్త ఖ్యాతి చెందిన విషయం జిల్లా ప్రజలందరికీ తెలిసినదే. ఈ కేంద్రం ఉదయగిరి కళాకారుల కళానైపుణ్యానికి ప్రతీక. అయితే ఇటీవల కరోనా దెబ్బతో ఇక్కడి కళాకారులు కూడా వృత్తిపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేంద్రం నిర్వహణ కూడా కష్టసాధ్యంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆ కళాకారులను అన్నివిధాలా ఆదుకుంటామంటూ ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ముందుకువచ్చారు. ఈనెల 2న ఆయన ఉదయగిరి దిలావర్ బాయ్ వీధిలో ఉన్న చెక్క నగిషీ కళాకేంద్రాన్ని సందర్శించారు. కళాకారులతో మాట్లాడారు. కేంద్రం నిర్వాహకులు జాకీర్, గౌసియా తదితరులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారి ఇబ్బందులు తీర్చేందుకు కృషిచేస్తామని, ఆ కేంద్రానికి అవసరమైన భవన నిర్మాణానికి కూడా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. సిఐ గిరిబాబు, ఎస్ఐ అంకమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాని, వైకాపా నాయకులు లక్ష్మయ్య పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు పటిష్టంగా ఏర్పాట్లు

ఇంటర్ పరీక్షల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 6 నుంచి 24వ తేదీ దాకా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 91 పరీక్ష కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ప్రతి కేంద్రంలోనూ సిసి కెమెరాల నిఘా ఉంటుంది. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా జరుగుతాయని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, మొత్తం 57,647 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని ఆర్ఐఓ వరప్రసాదరావు ఈనెల 2న నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో చెప్పారు. పరీక్షల మానిటరింగ్ అధికారిగా ఆర్‌జేడీ సాయిసుబ్బారావు ఉంటారని తెలిపారు.

# ఉత్తమ జర్నలిస్టులకు సన్మానాలు

ప్రపంచ పత్రికాస్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా ఈనెల 3న నెల్లూరులోని రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రాజపాళెం రఘు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. స్థానిక టౌన్‌హాలులోని రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ఆకుల మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొని జర్నలిస్టులను సత్కరించారు. సన్మానాలందుకున్న పాత్రికేయుల్లో శిఖరం వెంకటకృష్ణయ్య, కె.దయాశంకర్, పోలయ్య, షేక్ గౌస్‌మొహిద్దీన్, రహీం, నారాయణ, శేఖర్‌బాబు, నాగరాజు ఉన్నారు. ఏ.జయప్రకాష్, అందె శ్రీనివాసులు, జె.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 'నాడు-నేడు'తో
# పాఠశాలల అభివృద్ధి
**- నగర ఎమ్మెల్యే అనిల్**



ప్రభుత్వం అమలుచేస్తున్న 'నాడు-నేడు' పథకం ద్వారా పాఠశాలలకు ఎంతో అభివృద్ధి జరుగుతోందని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ చెప్పారు. ఈనెల 2న ఆయన నెల్లూరు 8వ డివిజన్‌లోని పత్తివారి ప్రభుత్వ పాఠశాలలో కోటీ 56 లక్షల వ్యయంతో తరగతి గదుల నిర్మాణానికి సంప్రదాయబద్ధంగా పూజలుచేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నగర నియోజకవర్గంలో ఈ పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్పొరేటర్లు కిన్నెర మాల్యాద్రి, మొగళ్లపల్లి కామాక్షిదేవి, దామవరపు రాజశేఖర్, కిన్నెర ప్రేమకుమార్, ఒబిలి రవిచంద్రతో పాటు 8వ డివిజన్ ఇన్‌చార్జి దొంతాల రఘు, వైకాపా నాయకులు ఇందూధర్‌రెడ్డి, ధనూజరెడ్డి పాల్గొన్నారు.

### శ్రీ ప్రసన్నాంజనేయునికి..
# నేత్రపర్వంగా పుష్పయాగం



నెల్లూరు పప్పులవీధిలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం దశమ వార్షికోత్సవ వేడుక ఈనెల 2న జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి 27 రకాల ద్రవ్యాలతో విశేషాభిషేకాలు చేశారు. సాయంత్రం శ్రీ సీతారామలక్ష్మణ సువర్చలాంజనేయస్వామి వార్లకు నేత్రపర్వంగా పుష్పయాగం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ముదివర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, ఆలయ ఇఓ హేమచంద్రరావుతో పాటు శ్రీరాంసురేష్, గాదంశెట్టి గోపాల్, అయితా రామచంద్రరావు, పొదర్తి బాలాజీ, ముప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ వేంకటేశ్వరునికి..
# లక్ష మల్లెల పూజ

నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 3న ప్రధాన అర్చకుడు సాయిభరద్వాజ్, ఆలయ కమిటీ సభ్యుల సారథ్యంలో స్వామివార్లకు వైభవంగా లక్ష మల్లెల పూజను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మల్లెపూలతో శ్రీవారిని అర్చించారు. శేషగిరిరావు, హరిత ఉభయ కర్తలుగా వ్యవహరించారు.



# ఎంపీ వేమిరెడ్డితో.. మంత్రి కాకాణి భేటీ

రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సేవాభూషణుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్)ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈనెల 3న కలుసుకున్నారు. కోవూరు మండలంలోని లేగుంటపాడులో ఉన్న విపిఆర్ వ్యవసాయ క్షేత్రంలో వీరిరువురూ కొద్దిసేపు జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై చర్చించుకున్నారు.

# వీఎస్‌యు అభివృద్ధికి కృషిచేస్తా
**మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి**



విఎస్‌యు అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల వెంకటాచలం మండలం కాకుటూరులోని వర్సిటీ కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన విఎస్‌యు వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. వర్సిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య జి.ఎం.సుందరవల్లితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తాను మంత్రి అయిన తర్వాత తొలిసారిగా యూనివర్సిటీకి రావడం సంతోషంగా ఉందని, తన నియోజకవర్గంలో యూనివర్సిటీ ఉండడంతో వర్సిటీతో, ఇక్కడి అధికారులతో తనకు అవినాభావ సంబంధం ఉందని అన్నారు. తాను ఇక్కడే పీహెచ్‌డి చేస్తుండడంతో విద్యార్థులతో సైతం అనుబంధం ఏర్పడిందన్నారు. జాతీయ రహదారి నుండి వర్సిటీ వరకు రోడ్డు నిర్మాణం జరిపామని, త్వరలోనే వర్సిటీ భవనాలు, అంతర్గతరోడ్ల నిర్మాణం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

వి.ఎస్.యూ వైస్-ఛాన్సలర్ ఆచార్య జి.ఎం.సుందరవల్లి మాట్లాడుతూ వర్సిటీలో ఇప్పటికే అనేక పరిశోధక ప్రాజెక్టులు జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో పరిశోధనలకు పెద్ద పీట వేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో వర్సిటీలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి యూనివర్సిటీని జిల్లాకే మకుటాయమానంగా తీర్చిదిద్దుతామన్నారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయ కృష్ణారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజా ఎస్ నాయర్, సమన్వయకర్త డాక్టర్ హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థినీవిద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలు సాంస్కృతిక విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంత్రి కాకాణి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వర్సిటీ అధికారులు మంత్రి కాకాణిని సత్కరించారు.







# దేశభక్తిని పెంపొందించడమే.. విహెచ్‌పి ధ్యేయం



దేశభక్తిని పెంపొందించడమే ధ్యేయంగా విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) నిరంతరం పనిచేస్తోందని భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి చెప్పారు. ఈనెల 1న నెల్లూరులోని గుండా ఆంజనేయులు కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన విహెచ్‌పి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణలో భాగంగా ప్రతి గ్రామంలోనూ విహెచ్‌పి కమిటీలను ఏర్పాటుచేస్తోందని తెలిపారు. విహెచ్‌పి జిల్లా అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, కార్యదర్శి శశికుమార్, రాజేంద్రప్రసాద్, గిరి తదితరులు పాల్గొన్నారు.

# నిత్యాన్నదానానికి లక్ష విరాళం



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి జిల్లాలోని నేలటూరు గ్రామ నివాసి టంగుటూరి సాయిహేమంత్ లక్షా నూటపదహారు రూపాయలను విరాళంగా అందజేశారు. ఆ చెక్కును ఈనెల 1న ఆలయ ఇ.ఓ గిరికృష్ణకు అందజేశారు.

# స్ఫూర్తిప్రదాత.. పుచ్చలపల్లి సుందరయ్య



కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శాలు స్ఫూర్తి దాయకమని, కార్మికులంతా ఆయన ఆశయాల బాటలో నడవాలని ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడినప్పుడే వారి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా ఈనెల 1న ఆయన నెల్లూరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుచ్చలపల్లి పుట్టినరోజు.. మే డే ఒకేరోజు కావడం సంతోషదాయకమన్నారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాజాన్ని చైతన్యవంతం చేసేదే.. కవిత్వం



సమాజాన్ని చైతన్యవంతం చేసేదే కవిత్వమని, కవులను అందరూ ప్రోత్సహించాలని విశ్రాంత డెప్యూటి కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి అన్నారు. ఈనెల 1న నెల్లూరు టౌన్ హాలులో సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ అధినేత సర్వేపల్లి రామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కవిసమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ కవయిత్రి, దక్షిణమధ్య రైల్వే (చెన్నై) పిఎస్ వాడవల్లి పూర్ణకామేశ్వరిని, కవులను ఘనంగా సన్మానించారు. కవి స్వర్గీయ దూబగుంట వెంకటేశ్వరరావు పేరిట జరిగిన ఈ కవి సమ్మేళనంలో అనేకమంది కవులు, కవయిత్రులు పాల్గొని కవితాపఠనం చేశారు. నెరసం అధ్యక్షులు ఏ.జయప్రకాష్, కవయిత్రులు సుభద్రాదేవి, తోట సులోచన, అవ్వారు శ్రీధరబాబు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎఫ్ రద్దు కోసం.. ఏపిటిఎఫ్ ఆందోళన




సిపిఎఫ్ విధానాన్ని రద్దుచేయాలంటూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఈనెల 1న నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. సిపిఎఫ్, జిపిఎఫ్ వగైరాలేమీ వద్దని, ఎలాంటి షరతులు లేని పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎఫ్ విధానాన్ని రద్దుచేసి ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఏపిటిఎఫ్ నాయకుడు కె.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, బాబు, జనార్ధన్‌రావు, హజరత్తయ్య, ప్రకాష్‌రెడ్డి, ఎస్‌కె సుభాన్, ఖాదర్‌బాషా, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు




# మేడే సంబరాలు

ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే) సందర్భంగా ఈనెల 1న జిల్లావ్యాప్తంగా ఉభయ కమ్యూనిస్టుపార్టీలు, వాటి అనుబంధ శాఖల నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకులు సంబరాలు చేసుకున్నారు. వాడవాడలా మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. నెల్లూరు నగరంలో ఆ పార్టీల కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో ఎర్రజెండాలు రెపరెపలాడాయి. భారీ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, పలుచోట్ల పార్టీ పతకాలను ఆవిష్కరించారు. అనంతరం నగర వీధుల్లో పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం నాయకులు మూలం రమేష్, చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, మోహన్‌రావు, అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, ప్రసాద్, మస్తాన్‌బీ, సిపిఐ నాయకులు అరిగెల నాగేంద్రసాయి, రామరాజు, నాగేంద్ర, మునీర్, ఎపిటిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సుబ్రహ్మణ్యం తదితరుల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి.

# ఆడబిడ్డల రక్షణ ఇదేనా?

## - టిడిపి నాయకురాలు తాళ్ళపాక అనూరాధ



రాష్ట్రంలో వైకాపా పాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతూనే ఉన్నాయని, నిత్యం ఎక్కడో ఒకచోట అరాచకాలు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని, ఆడబిడ్డల రక్షణ ఇదేనా అని టిడిపి మహిళా నాయకురాలు తాళ్లపాక అనూరాధ ప్రశ్నించారు. ఈనెల2న నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత మూడేళ్ళలో దాదాపు 15వందల మందికిపైగానే మహిళలపై అత్యాచారాలు జరిగాయంటే రాష్ట్రంలో పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థమవుతుందన్నారు. వైకాపాకు ఓట్లు వేసి గెలిపించిన ఆడబిడ్డలకు రక్షణ ఇదేనా అని ప్రశ్నించారు. తన విజయానికి అండగా నిలిచిన తన తల్లినే విస్మరించిన ముఖ్యమంత్రి ఆడబిడ్డలకు ఎలా రక్షణ కల్పించగలడని విమర్శించారు. ఇటీవల హోంమంత్రి చేసిన వ్యాఖ్యలు తల్లులను కించపరిచేవిధంగా ఉన్నాయని, మహిళాలోకానికి ఆమె వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా విభాగం నాయకురాళ్ళు బివి లక్ష్మి, రేవతి, సుశీలమ్మ, మంగమ్మ, మల్లిక, సెల్వీ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్చరీ జిల్లా జట్ల ఎంపికలు



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-9, అండర్-14 బాలబాలికల ఆర్చరీ జట్లను ఈనెల 1న ఎంపిక చేశారు. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో బాలబాలికలు పాల్గొన్నారు. ఎంపికైనవారు ఈ నెల 5 నుంచి 9వ తేది వరకు విజయవాడలో రాష్ట్రస్థాయిలో జరిగే 12వ మినీ, నాల్గవ కిడ్స్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీహర్ష, వేణు పేర్కొన్నారు.

# పేదలకు ఆర్యవైశ్య మహిళల పింఛన్లు

నెల్లూరు పప్పులవీధిలోని అర్బన్ ఆర్యవైశ్య మహిళా విభాగం వారు ఈనెల 1న జేసీభవన్‌లో ఆర్యవైశ్య పేదలకు, వృద్ధులకు, దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.500 వంతున 30మందికి పింఛన్లు అందజేశారు. సంఘం అధ్యక్షురాలు గుండపల్లి పద్మప్రియ, కార్యదర్శి వాయుగుండ్ల సుప్రియ, కోశాధికారి చిన్ని పద్మజ తదితరులు ఈ పథకానికి శ్రీకారం చుట్టారు.

# జిల్లా ఎస్పీని అభినందించిన.. హైకోర్టు న్యాయమూర్తి



జిల్లాలో మహిళలకు సంబంధించిన కేసుల్లో పోలీసుల స్పందన బావుందంటూ హైకోర్టు న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ ఆసుద్దీన్ అమానుల్లా జిల్లా పోలీసులను మెచ్చుకున్నారు. జిల్లా ఎస్పీ విజయారావును ఈ సందర్భంగా శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఒంగోలులో ఈనెల 2వ తేది బాలల హక్కులు, పోక్సో చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో ఎస్పీకి ఈ సముచిత సత్కారం జరిగింది.

# దళితుల సంక్షేమం.. టిడిపి లక్ష్యం

## - బీద రవిచంద్ర



దళితుల సంక్షేమం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కృషిచేస్తోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర చెప్పారు. ఈనెల 1న ఆయన నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైందన్నారు. టిడిపి హయాంలో దళితుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. వైకాపా ప్రభుత్వంలో దళితులపై దాడులు, హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని, ఆ అన్యాయాలను ప్రజలకు తెలియజేసేం దుకు జూన్ 6వ తేది నుంచి 180 రోజుల పాటు 'గడప గడపకు అంబేద్కర్ వారసులం' అనే కార్యక్రమాన్ని టిడిపి చేపట్టనుందని వివ రించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో టిడిపిని బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. టిడిపి నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లు, సత్యనాగేశ్వరరావు, మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, జడ్.శివప్రసాద్ పాల్గొన్నారు.

# విశ్వసాయి డా.ఎస్సార్కేలో క్రీడాపోటీలు



నెల్లూరు మాగుంట లే-అవుట్‌లో ఉన్న విశ్వసాయి డా.ఎస్సార్కే స్కూల్‌లో ఈనెల 1న విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. బాలబాలికలకు పరుగు పందెం, ఖోఖో, క్రికెట్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా. ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోనే కాక క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ జెవి కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఎస్.రఘురామ్ పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్.. చలివేంద్రం



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1న స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు సుబ్బారావు, 203వ జిల్లా వాకర్స్ గవర్నర్ హనుమంతురావు, వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి, కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడులతో పాటు వినుకొండ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, సుబ్బారావు, శ్రీనివాసులు, రాఘవేంద్రశెట్టి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయ డెయిరీకి చేయూతనివ్వండి

## - మంత్రి కాకాణికి.. కొండ్రెడ్డి వినతి



కరోనా నేపథ్యంలో గత రెండేళ్ళుగా విజయ డెయిరీకి బాగా నష్టాలు వచ్చాయని, ఈ కష్టాల నుంచి ఆదుకుని డెయిరీ అభివృద్ధికి తగు చేయూతనందించాలని డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 2న ఆయన నెల్లూరులో మంత్రి కాకాణిని కలసి వినతిపత్రం అందించారు. డెయిరీలోని యంత్రాలను మార్చాల్సి వుందని, అదేవిధంగా ఉద్యోగుల విఆర్‌ఎ పథకానికి, ప్రైవేటు డెయిరీల పోటీని తట్టుకుని నిలబడేందుకు కనీసం 10 కోట్ల రూపాయల దాకా అవసరమవుతుందన్నారు. 'అమూల్' సంస్థతో కలసి పనిచేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. అందుకు మంత్రి కాకాణి స్పందిస్తూ ప్రభుత్వం తరపున విజయ డెయిరీకి అవసరమైన సాయం చేసేందుకు అన్ని విధాలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. డెయిరీ మేనేజింగ్ డైరక్టర్ కోడూరు కృష్ణమోహన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కమిషనర్ గారూ!.. గ్రంథాలయ సెస్సు చెల్లించండి



జిల్లా గ్రంథాలయ సంస్థకు నెల్లూరు కార్పొరేషన్ వారు 19 కోట్ల రూపాయల సెస్సును చెల్లించాల్సి ఉందని, గ్రంథాలయాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కమిషనర్ ఆ సెస్సు బకాయిలను త్వర లోనే చెల్లించేలా చూడాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద ఈనెల 2న నగర కార్పొరేషన్ కమిషనర్ జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి సెక్రటరీ ప్రసాద్, సిబ్బంది నాగేంద్రరావు, రవీంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ముగ్గురు

# ఏఎస్పీల బదిలీ

జిల్లాలో ముగ్గురు ఏఎస్పీలను బదిలీ చేశారు. ఇద్దరు ఏఎస్పీలను కొత్తగా జిల్లాలో నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఎస్పీల బదిలీల్లో భాగంగా రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ తాజాగా ఉత్తర్వులిచ్చారు. జిల్లా ఏఎస్పీ (అడ్మిన్)గా పనిచేస్తున్న పి.వెంకటరత్నంను విజయవాడ క్రైమ్ పోలీసు విభాగానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో డి.హిమవతిని నియమించారు. అదేవిధంగా కావలి ఏఎస్పీ డి.ప్రసాద్‌ను కర్నూలు ఏఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. ఇంటలిజెన్స్ విభాగంలో ఉన్న భవానీహర్షను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి మార్చారు. డిజి కార్యాలయంలో ఉన్న కె.చౌడేశ్వరిని ఏఎస్పీగా నియమించారు. బదిలీపై జిల్లా నుంచి వెళ్తున్న వెంకటరత్నం, జిల్లాకు కొత్తగా వస్తున్న చౌడేశ్వరి, హిమవతి ఒకే బ్యాచ్‌కు చెందినవారు కావడం విశేషం.

# బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న పెంచలకోన

## - ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆనం



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలో ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 11 నుంచి 17వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులోని ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఆర్డీఓ కొండయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఆనం మాట్లాడుతూ ఈ ఆలయం చరిత్రాత్మకమైనది.. ఎంతో మహిమాన్వితమైనదని అంటూ, రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల నుంచి భక్తులు పెంచలకోన బ్రహ్మోత్సవాలకు వస్తారు కనుక భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అధికారులను కోరారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించాలన్నారు. ఆలయ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఇఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు, వెంకటగిరి మునిసిపల్ కమిషనర్ ప్రసాద్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఆడబిడ్డలపై అత్యాచారాలు జరుగుతున్నా.. పట్టించుకోరేం?!..

## • వైకాపా తీరుపై భాజపా ధ్వజం

రాష్ట్రంలో ఆడబిడ్డలపై అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లిప్తవైఖరితో ఉండడం ఏమిటని, ఎన్ని ఘోరాలు జరుగుతున్నా వైకాపా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమని భాజపా నాయకులు ధ్వజమెత్తారు. ఈనెల 3న నెల్లూరులోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. భాజపా రాష్ట్ర సంఘటనా కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు తదితరులు మాట్లాడారు. రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా లెక్కలేనట్లుగా వ్యవహరిస్తుండడం విచారకరమన్నారు. భాజపా నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, కాకు విజయలక్ష్మి, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.




# 8వ వర్ధంతి

మా ఇంటి ఆశాదీపం

## జక్కా రామ్‌మోహన్‌రెడ్డి

పరమపదించి తే. 6.5.2022ది నాటికి ఎనిమిది సంవత్సరాలు గడుస్తాయి.
వారి దివ్యస్మృతిలో...

నానమ్మ : జక్కా కామేశ్వరమ్మ

నాన్న - అమ్మ
జక్కా కోదండరామిరెడ్డి - జక్కా సులోచనమ్మ
మాజీ శాసనసభ్యులు

భార్య : జక్కా వినుజరెడ్డి

కుమార్తె : జక్కా రిధిరెడ్డి

కుమారుడు : జక్కా మనవ్‌రెడ్డి

తమ్ముడు - మరదలు
జక్కా జనార్ధన్‌రెడ్డి - జక్కా స్మితరెడ్డి

తమ్ముని కుమారుడు : జక్కా కోదండ శ్రీవత్స

చెల్లెలు - బావ
పద్మజ - ఎ.బి.వి.రమణారెడ్డి

చెల్లెలి కుమార్తెలు : ప్రియదర్శిని వెంకట్, యామిని వెంకట్

జననం 09.09.1964

మరణం 06.05.2014

# భక్తిశ్రద్ధలతో.. రంజాన్



పవిత్రమైన రంజాన్ పండుగను ఈనెల 3న ముస్లిమ్ సోదరులు జిల్లావ్యాప్తంగా సంతోషంగా జరుపుకున్నారు. హిందువులు–ముస్లిమ్‌లు సోదరుల్లా కలిసిమెలిసి రంజాన్ (ఈద్–ఉల్–ఫ్రిత్) వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నియమ నిష్టలతో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు, ప్రార్థనలు ఆచరించిన ముస్లిమ్ సోదరులు సర్వమానవాళి శ్రేయస్సును కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నెల్లూరు నగరంలోనూ ఈ సందర్భంగా మసీదులు, ఈద్గాలు భక్తుల రాకపోకలతో కళకళలాడాయి. మతపెద్దలు రంజాన్ మాసం ప్రత్యేకతను అందరికీ వివరించారు. దైవగ్రంథమైన దివ్య ఖురాన్ ఈ మాసంలోనే ఉద్భవించిందని, ఇస్లాం విశ్వశాంతిని బోధిస్తుందని మతపెద్దలు తెలిపారు. దేశవ్యాప్త ఖ్యాతిచెందిన నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మతపెద్దలు అబూబకర్ ఆష్రఫి సాబిరి ఖుత్బా దైవసందేశం వినిపించారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ విజయారావు, ఇన్‌చార్జి కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఆర్డీఓ కొండయ్య, ఏఎస్పీ వెంకటరత్నం పాల్గొన్నారు.

## వెలుగుల వెనుక చీకట్లు

# ఎల్ఇడిలతో ఇక్కట్లు

**ఇప్పుడు దేశం ఎల్ఇడి వెలుగులతో నిండిపోతోంది. విద్యుత్‌ను ఆదా చేయడం కోసం ఎల్ఇడి దీపాలనే వాడమని ప్రభుత్వాలు సైతం ప్రచారాలతో ఊదరగొడుతున్నాయి. మన రాష్ట్రంలో కూడా వీధులన్నీ ఎల్ఇడి బల్బులతో నిండిపోయాయి. కానీ, వీటివల్ల లాభాలు ఏ స్థాయిలో ఉన్నాయో.. నష్టాలు కూడా అంతే స్థాయిలో ఉన్నాయి. కళ్ళు జిగేల్ మనిపించే వెలుగుల వెనుక ఎన్నో బతుకులు చీకటిమయమవుతున్నాయి.**



### కాంతి కాలుష్యం

సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ దానికి తగ్గట్లుగా దుష్ప్రభావాలు కూడా అదే స్థాయిలో ఉంటున్నాయి. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, ధ్వని కాలుష్యం లాగే ఎల్ఇడి వెలుగుల ద్వారా కాంతి కాలుష్యం ఏర్పడుతోంది. వాటి నుండి వెలువడే నీలి కాంతి ఆకాశంలోని నక్షత్రాల మెరుపును సైతం నిర్వీర్యం చేస్తున్నాయి. సాధారణంగా మామూలు బల్బులు మనం స్విచ్చి వేయగానే కరెంటు నేరుగా తీసుకుని బల్బు వెలుగుతుంది. కానీ ఎల్ఇడి(లైట్ ఏమినింగ్ డ్యాయోట్) చౌక్ లాంటి పరికరం ద్వారా ప్రసరితమవుతుంది. ఒకవైపు విద్యుత్‌ని అదాచేస్తూ వెలుగును అత్యంత కాంతివంతంగా ప్రసరించడానికి ఈ పరికరం ఉపయోగపడుతుంది. ఈ పరికరం వల్ల సాధారణ కాంతి కంటే కొన్ని రెట్ల అధికశాతం కాంతిని ఎల్ఇడి లైట్ విరజిమ్ముతుంది. పాతరోజుల్లో సాయంత్రం వేళల్లో డాబాపై పడుకుని ఆకాశం వైపు చూస్తే లెక్కపెట్టలేనన్ని నక్షత్రాలు కనపడేవి. ఇప్పుడు ఆ నక్షత్రాల మెరుపులను కూడా ఈ ఎల్ఇడి కాంతులు మింగేసేంతగా ఈ వెలుగు ఉంటుంది. కాంతివంతంగా ప్రకాశించే నక్షత్రాలు తప్పితే మామూలు స్టార్స్ మన కంటికి కనిపించవు. సాధారణ బల్బుల కాంతిని చూసినట్లుగా ఎల్ఇడి వెలుగులను మనం చూడలేం. వీటి కాంతి మానవాళి కళ్ళపై కూడా చెడు ప్రభావాన్ని చూపిస్తుందని వైద్యులు చెప్తున్నారు.

అలాగే ఈ ఎల్ఇడి మెరుపుల వల్ల వన్యప్రాణులకు కూడా చెడు జరుగుతోంది. కొన్ని జంతువులలో పునరుత్పత్తి శక్తిని సైతం ఈ నీలి కాంతి హరించేస్తోందని, పక్షులు సైతం ఈ కాంతి మూలంగా రాత్రి, పగలకు తేడా తెలియక తికమకపడుతున్నాయని చాలా సర్వేలు చెప్తున్నాయి.

### లాభం - నష్టం రెండూనూ...

ఏ వీధిలోనైనా, ఇంట్లోనైనా ఎల్ఇడి బల్బులు కొత్తవి బిగించిన తొలి రోజులలో కాంతి విపరీతంగా వస్తుంది. ఎంతటి కాంతి అంటే... మనం వాటివైపు కళ్ళెత్తి చూడలేనంత. కానీ, కాలం గడిచేకొద్దీ ఆ వెలుగు మసకబారుతుంది. ఇప్పుడు నగరంలో ఉన్న ఎల్ఇడి బల్బుల వెలుగులు చూస్తే ఆ విషయం ప్రతిఒక్కరికీ అర్థమవుతుంది. అసలు వీధిలో బల్బులు ఉన్నాయా..? లేవా..?? అనే అనుమానం కలుగుతోంది. కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారైనా ఇళ్ళల్లో, వీధుల్లో బల్బులను మార్చాల్సిన అవసరం ఉంది. కరెంటు ఆదాయం కోసం తరచూ ఈ లైట్లను బిగించే బదులు వెలిగినంత కాలం కాంతివంతంగా ఉండే మాములు బల్బులే మేలేమో అని చాలామంది భావిస్తున్నారు.

### ఇబ్బంది పడుతున్న వాహనదారులు...

చాలామంది వాహనదారులు ఎల్ఇడి వెలుగులకు ఆకర్షితులై తమ వాహనాలకు ఎల్ఇడి బల్బులను బిగించి మరీ తిరుగుతున్నారు. అవి తగిలించుకు తిరిగినవారికి బాగానే ఉంటుందేమో కానీ, వారికి ఎదురుగా వచ్చే వాహనదారులకు మాత్రం కళ్ళు కనపడకుండా చేస్తున్నాయి. ఇప్పుడు మార్కెట్లో వచ్చే ప్రతి వాహనం ఎల్ఇడి బల్బుతోనే వస్తోంది. అదీ పగటిపూట కూడా వెలిగేలా! మంచు ప్రదేశాల్లో అయితే ఈ ఎల్ఇడి బల్బులు ఉపయోగపడతాయేమోకాని, మనలాంటి దక్షిణాది రాష్ట్రాల్లో వీటి అవసరం అంతగా లేదు. మెరుపులాంటి వీటి అధిక కాంతి వల్ల రోడ్డు కూడా సరిగా కనపడదు. ఎదురుగా వచ్చే వాహనదారులను ఈ వెలుగు చాలా ఇబ్బంది పెడుతుంది. ఒక్కోసారి వాళ్ళు దారి కనపడక వాహ నాన్ని ఆపేయాల్సి వస్తుంది కూడా. ఇలా దారి కనపడక చాలా ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ ఎల్ఇడి వెలుగు పుణ్యమా అని అనేక జీవితాలు చీకటి మయ మయ్యాయి కూడా.

### దారి దోపిడీలకు

### ఇవి కూడా ఉపకరిస్తున్నాయి...

సాంకేతిక విప్లవాన్ని సామాన్య పౌరులే కాకుండా దొంగలు కూడా ఉపయోగించుకుంటుండడం విశేషం. ఈ ఎల్ఇడి బల్బుల వెలుగులను ఆసరా చేసుకుని రహదారులపై దారి దోపిడీదారులు విజృంబిస్తున్నారు. హైవేపై వెళ్తున్న వాహనాలకు ఎదురుగా నిలబడి అత్యంత కాంతివంతమైన ఎల్ఇడి లైట్ డ్రైవర్ కంటిపై వేస్తారు. ఆ కాంతి వాహన చోదకుడి కళ్ళకు తాకగానే చీకట్లు కమ్మి తన వాహనాన్ని ఆపేస్తాడు. వెంటనే దొంగలు వాహనంపై పడి దోచేస్తారు.

మొత్తానికి విద్యుత్ వినియోగాన్ని తగ్గించి సామాన్యులపై కరెంటు బిల్లుల భారం పడకుండా ఒకవైపు ఈ ఎల్ఇడి బల్బులు ఉపయోగపడుతున్నా, మరోవైపు అసాంఘిక కార్యకలాపాలకు, ఆకస్మిక రోడ్డు ప్రమాదాలకు కూడా ఈ వెలుగులు కారణభూతమవుతున్నాయి.

కొన్ని కావాలంటే కొన్ని కోల్పోవాలి... అంటే ఇదేనేమో...!

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# అళఘునాథస్వామి దేవస్థాన నూతన పాలకమండలి



తూర్పు గూడూరులో ఉన్న శ్రీశ్రీశ్రీ అళఘునాథస్వామి దేవస్థానం నూతన పాలక మండలి సభ్యులు ఇటీవల ప్రమాణస్వీకారం చేశారు. గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఛైర్మన్‌గా బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, పాలకమండలి సభ్యులుగా పెరికల కృష్ణయ్య, చిప్పల జోతిర్మయి, ఎస్.శ్రీనివాసులు, జొన్నా రత్నమ్మ, పి.మంజుల, దొడ్ల శారదలచే ప్రమాణస్వీకరం చేయించారు. ఎక్స్అఫిషియో మెంబర్ (అర్చకులు) పరాంకుశం సత్యఅశోక్, కార్యనిర్వహణాధికారి వై.శంశాక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ కేంద్ర కమిటి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కమిటీ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, వైయస్సార్సీపీ నాయకులు కోడూరు మీరారెడ్డి, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, కోదండ రామాంజనేయస్వామి దేవస్థానం ఛైర్మెన్ తాళ్ళూరు శ్రీనివాసులు, జానకిరామిరెడ్డి, ఎమ్.సీతారామిరెడ్డి, సతీష్, కోట సునీల్‌కుమార్, గంగిశెట్టి శివకుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎన్.బాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# పిఎస్ఆర్ ట్రస్ట్ రంజాన్ తోఫా


రంజాన్ తోఫాను అందజేస్తున్న పొణకా దంపతులు

గూడూరులోని పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ తోఫాను రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ – శివకుమార్‌రెడ్డి దంపతులు ఇటీవల వారి నివాసంలో అందజేశారు. 100మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఈ కార్యక్రమం చేపడుతున్నామని, పండుగ సమయాల్లో ప్రజలు సంతోషంగా జీవించాలన్నదే ట్రస్టు లక్ష్యమని అన్నారు. వైసిపి నాయకులు కోదండయ్య, బాలిబోయిన రమేష్, గోపాల్‌యాదవ్, జమళ్ళ వాసు, ముని, హాషిం, ఇమ్రాన్, చిన్న, సాయి, మైనార్టీ నాయకులు అజీజ్‌ఖాన్, నజీముద్దీన్, ఫేమస్ ఇబ్రహిం, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ




గూడూరు పట్టణంలోని సిరామిక్ రోడ్డు ప్రాంతంలో ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో దొంగలు పడ్డారు. ఆలయ తలుపులు బద్దలు కొట్టి స్వామివారి వెండి ఆభరణాలను దోచుకెళ్ళారు. గూడూరు రెండో పట్టణ ఎస్సై తిరుపతయ్య ఆలయానికి చేరుకొని పరిశీలించారు. సంఘటనా స్థలంలో క్లూస్‌టీమ్‌తో వేలిముద్రలు సేకరించారు. చోరీకి గురైన ఆభరణాల విలువ సుమారు 80వేల రూపాయలు ఉంటుందని స్థానికులు తెలిపారు. ఆమేరకు ఎస్సై తిరుపతయ్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# ప్రగతి షటిల్ టోర్నమెంట్



మే 2వ తేదీ గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జి2 ఇండోర్ గేమ్స్‌జోన్ సహకారంతో కాశి లేఅవుట్‌లోని జి2 ఇండోర్ గేమ్స్ జోన్ షటిల్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో గూడూరు మున్సిపాలిటీ గ్రేడ్–1 పరిధిలోని 48 జట్లు పాల్గొనగా విజేతలుగా రమేష్ – చంద్ర, రన్నర్స్‌గా నాగార్జున – సునీల్, తృతీయ స్థానంలో విష్ణు – అరుణ్, నాల్గవ స్థానంలో అశోక్ & తేజ(చెన్నూరు) నిలిచారు. బెస్ట్ అఫెన్స్ ప్లేయర్‌గా కలామ్ భాయ్, బెస్ట్ డిఫెన్స్ ప్లేయర్ అఖిల్ అశ్రఫ్ ఎంపికయ్యారు. వీరందరికీ ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొండా కాశి చేతుల మీదుగా షీల్డులను బహుకరించడం జరిగింది. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ శ్రీనివాసులు, గోపి, గిరీష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళలో.. దోపిడీ పర్వం

- అమలుకు నోచుకోని ప్రభుత్వ నిర్ణయం
- అన్నదాతలకు అడుగడుగునా అన్యాయం
- మిల్లర్లు, దళారులదే రాజ్యం
- పట్టించుకోని అధికార గణం

**జిల్లాలో విస్తారంగా వరి పండుతున్నా ఆ పంటను సాగుచేసుకునే రైతులు ధాన్యాన్ని అమ్ముకోవడం ప్రతి ఏటా ఒక పెద్ద కసరత్తుగా మారుతూనే ఉంది. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఆచరణలోకి రాకపోవడంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో మళ్ళీ మిల్లర్లను, దళారులనే ఆశ్రయించాల్సి వస్తోంది. అటు ప్రభుత్వం కానీ, ఇటు అధికారగణం కానీ, చివరికి రైతులకు భరోసా ఇవ్వాల్సిన రైతుభరోసా కేంద్రాలు కానీ రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంతో ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులకు కొనుగోళ్ళ విషయంలో ప్రతిసారీ కష్టాలు..నష్టాలు..కన్నీళ్లే మిగులుతున్నాయి.**



జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు ఒక పెద్ద ప్రహసనంగా మారాయి. రైతులను మాయ చేసి తక్కువ ధరకే ధాన్యం కొల్లగొట్టుకు పోతున్న దళారీల వ్యవస్థను, మిల్లర్ల జోక్యాన్ని నివారించడానికి ప్రభుత్వమే మద్దతు ధర ప్రకటించి, రైతుల వద్ద నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఉన్నాయని చెప్తున్నా, వాస్తవానికి వచ్చేసరికి రైతన్నలు నిత్యం మళ్ళీ దళారులు, మిల్లర్ల దోపిడీకే గురవుతున్నారు. ప్రభుత్వం చెప్పేదొకటి.. ఇక్కడ జరిగేదొకటి అన్నట్లుగా ఉంది పరిస్థితి.

## రైతుల్ని మిల్లర్ల చుట్టూ తిప్పుతున్న ఆర్బీకేల సిబ్బంది

ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎక్కడకూ తిరగాల్సిన పనే లేదని, రైసుమిల్లుల వద్దకు అసలు వెళ్ళాల్సిన అవసరమే లేదని, కల్లాల్లో ఉన్న ధాన్యం వద్దకు ఆర్బీకేల సిబ్బందే వచ్చి, తేమశాతం పరిశీలించి, ధాన్యం తీసుకువెళ్లేందుకు అవసరమైన గోతాలు, రవాణాచార్జీలు, ఇంకా అవసరమైతే కూలీలను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని, అవి వీలుకాని పక్షంలో రైతుల వద్ద కొన్న ధాన్యానికి కొనుగోలు ఖర్చుల కింద టన్నుకు 250 రూపాయలను ఇస్తుందని, ఆ డబ్బు రైతుల ఖాతాకు నేరుగా జమ అవుతుందని ప్రకటించింది. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన ఈ విధానాలు రైతుల్లో ఎంతో సంతోషం కలిగించాయి కూడా. అయితే తీరా ధాన్యం పండి కొనుగోళ్ళ వద్దకు వచ్చేటప్పటికి పరిస్థితి మళ్లీ యథాస్థితికి వచ్చేసింది. ఆర్బీకేలలో ఎలాంటి సదుపాయాలు లేకపోవడం, అక్కడి సిబ్బందికి కొనుగోళ్ళ విషయంలో శిక్షణ లేకపోవడంతో కొనుగోళ్ళు మందగించిపోతున్నాయి. ధాన్యం తెచ్చిన రైతుల్ని ఆర్బీకేల వారు మిల్లుల చుట్టూ, మిల్లర్ల చుట్టూ తిప్పడం షరామామూలైంది. ప్రభుత్వం చెప్పిన విధానాలకు గండికొడుతూ ఆర్బీకేల సిబ్బంది అన్ని రకాలుగా తమను ఇబ్బందులు పెడుతున్నారంటూ పలు గ్రామాల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని ముందుగా మిల్లర్లకు శ్యాంపిల్ చూపించి ఆర్బీకేలకు తీసుకురావాలని సిబ్బంది చెప్తుండడంతో... రైతులు మళ్ళీ మిల్లర్లను, దళారులనే ఆశ్రయిస్తున్నారు.

## మద్దతు ధర ఉన్నా.. ఇచ్చే నాధులేరీ?..

ప్రభుత్వం మద్దతు ధర పుట్టికి 16,600 రూపాయలు ప్రకటించినా ఇచ్చే నాధులే కనిపించడం లేదు. మద్దతు ధర ఇచ్చి నేరుగా రైతుల నుంచి రైతుభరోసా కేంద్రాల ద్వారా ఆ ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినప్పటికీ, ఆచరణలోకి వచ్చేసరికి అంతా తారుమారుగా ఉంది. తేమశాతం ఎక్కువగా ఉందని కుంటిసాకులు చెప్తూ రైతుల నుంచి తక్కువ ధరకే ధాన్యం తీసుకుంటున్నారు. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా పుట్టికి దాదాపు వెయ్యికేజీల ధాన్యాన్ని అదనంగా తీసుకోవడమే కాక, మద్దతు ధరను కూడా తమ చిత్తానుసారం సుమారు 4వేల దాకా తగ్గించి ఇస్తూ రైతుల్ని దోపిడీ చేసేస్తున్నారు. ఈ లెక్కన రైతు ఓ 5 పుట్ల ధాన్యం అమ్ముకుంటే, దాదాపు ఒక పుట్టి దాకా నష్టపోవాల్సిన దుస్థితి. ఇంత అన్యాయం ఎక్కడైనా ఉందా?.. మద్దతు ధర ఇస్తున్నామంటూనే 12 నుంచి 14వేల దాకానే తగ్గించి ఇస్తూ రైతులను నిలువునా ముంచేస్తున్నా ప్రభుత్వం కానీ జిల్లా అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో ఈ దోపిడీ యథేచ్ఛగా సాగిపోతూనే ఉంది.

## నత్తనడకలో ధాన్యం కొనుగోళ్ళు

జిల్లాలో ఈ 2020-22 ఖరీఫ్ సీజన్‌లో16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయివుంటుందని అంచనా. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 493 రైతుభరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఖరీఫ్ ముగిసే నాటికి 299 రైతుభరోసా కేంద్రాల్లో లక్షా 86వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. ఏప్రిల్ నుంచి ప్రారంభమైన రబీ సీజన్‌లో ఇప్పటి దాకా 2.50 లక్షల మెట్రిక్ టన్నులు.. మొత్తంగా సుమారు 4.16 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోళ్ళు జరిగాయి. ఇంకా కొనాల్సింది సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల దాకా ఉంది. ఈ ధాన్యాన్నంతా ఎప్పటికి కొంటారో తెలియదు. ధాన్యం కొనుగోళ్ళు ఇలా నత్తనడక నడుస్తుండడంతో రైతులు మానసిక వత్తిడికి గురవుతున్నారు.

## 'తేమ శాతం' పేరుతో రైతుకు బురిడీ :

ధాన్యం కొనుగోళ్ళలో తేమశాతం ఎక్కువగా ఉందంటూ రైతులను మభ్యపెట్టి బురిడీకొట్టిస్తున్నారు. తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి, మిల్లులో ఆడించి శ్యాంపిల్స్ తీసుకుని ఖచ్చితమైన తేమశాతాన్ని నిర్ధారించకపోవడంతో రైతులు ప్రతిసారీ ఈ అన్యాయానికి గురవుతూనే ఉన్నారు. ధాన్యం కొనుగోళ్ళలో రైతులకు జటిలంగా తయారైన ఈ తేమశాతం సమస్యను నివారించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. అందులోనూ నెల్లూరుజిల్లా వరికి పుట్టినిల్లే అయినా.. రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకమైన వాతావరణ పరిస్థితులు జిల్లాలో ఉండడం, ఖరీఫ్-రబీ సీజన్లకు సంబంధించి నిర్దిష్టమైన విధానాలను ఇక్కడ అమలుచేసేవారు లేకపోవడం, రాష్ట్రస్థాయిలో ఉన్న అధికారులు అన్ని జిల్లాలతో పాటు నెల్లూరుజిల్లాను గుర్తించకపోవడం, సరైన లక్ష్యాలను నిర్దేశించకపోవడం వంటి సమస్యలు ఇక ఎప్పటికి తీరుతాయో!..అంతేకాదు, కల్లాల్లో నుంచి ఆర్బీకేలకు ధాన్యం చేరాలంటే ఎన్నో ఇబ్బందులు. గోతాల సమస్య, కూలీలు, రవాణా వాహనాలు, ఇతరత్రా సదుపాయాలు లేకపోవడం ఇలా ఎన్నో కష్టాలు. ఎంతో కాలంగా ఉన్న ఈ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ప్రభుత్వం చెప్తున్నా ఆచరణలో ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు లేనిపోని తిప్పటతో ప్రతిసారీ అన్యాయాల పాలవుతూనే ఉన్నారు. ఇకనైనా ఈ అన్యాయాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి.

---

# భక్తుల కొంగుబంగారం.. 'నిప్పో' షిరిడీ సాయిబాబా దేవాలయం

**'గు'శబ్ద స్త్వంధకార:స్యాత్ 'రు'శబ్ద స్తన్నిరోధక: అంధకార నిరోధిత్వా ద్గురురిత్యభిధీయతే!..** అంటూ గురువు విశిష్టతను 'నారద భక్తిసూత్రాలు' చాలా గొప్పగా చెప్పాయి. 'గు' అనే శబ్దం అంధకారానికి సంబంధించినది. 'రు' అనేది.. ఆ అంధకారాన్ని నశింపజేసే ప్రకాశాన్ని కలిగినట్టిది. అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి జ్ఞానమనే వెలుగులను ప్రసాదించేది గురువే అన్నది ఆ శ్లోకం భావం. గురువులంటే భగవత్ సాక్షాత్కారానికి దారిచూపే సమర్ధ సద్గురువులన్నమాట. అందుకే సద్గురువులు.. జగద్గురువులు. వారు దైవస్వరూపులే కాదు..సాక్షాత్తూ ఆ భగవంతుని రూపాలేనంటున్నాయి మన శాస్త్రాలు. ఏ దారి మనల్ని భగవంతునికి చేరువ చేస్తుందో ఆ దారి చూపడమే కాక, అన్ని దారులను ఆ భగవంతుని వైపు నడిపేందుకే అవతరించిన సద్గురుదేవుడు..శ్రీ షిరిడీ సాయినాథుడు. అన్ని మతాల సారం ఒకటేనంటూ ఆచరించి చూపడమే కాక, తన మహిమలు, లీలలతో భక్తుల బాధలు బాపి, సత్యధర్మాలను, సకల మానవాళికి శాంతి-సహనాన్ని, శ్రద్ధ-సబూరిని ప్రబోధించిన దత్తావతార స్వరూపుడు శ్రీ సాయిబాబా. దత్తావతారమంటే దైవత్వంతో పాటు గురుతత్వం కూడా కలగలిసినట్టిది. అందుకే అవతారపురుషుడైన శ్రీ సాయిదేవుడినే పరబ్రహ్మ రూపంగా, సర్వదేవతా స్వరూపంగా భక్తులు ఆరాధిస్తూ ఉంటారు. భక్తులకు కొంగు బంగారంగా, పిలిచిన పలికే దేవుడు.. శ్రీ సాయినాథుడికి మరికొందరు భక్తులు అక్కడక్కడా ఎంతో అపురూపమైన ఆలయాలు నిర్మించి నిత్యపూజలు చేస్తుంటారు కూడా. అలాంటి పలు ఆలయాలు నెల్లూరులోనూ ఉన్నాయి. వాటిలో ఎంతో దివ్యమైనది ఇటీవలే నిర్మించిన 'నిప్పో' ఫ్యాక్టరీ ఆవరణలోని 'శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయం'.

## ఆలయ చరిత్ర :

నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో ఉన్న ఆటో కార్మికులు కొందరు, నిప్పో ఉద్యోగులు కొందరు కలిసి శ్రీ సాయినాధునిపై





**మన దేవాలయాలు 98**

భక్తితో 1992లో ఏర్పాటుచేసుకున్న ఓ చిన్ని బాబామందిరమే.. ఇప్పుడు ఆ ఫ్యాక్టరీ యాజమాన్యం వారి సహకారంతో ఒక సుందరమైన దేవాలయంగా రూపుదిద్దుకుంది. అప్పట్లో ఫ్యాక్టరీ వద్ద రోడ్డు పక్కగా ఏర్పాటుచేసుకున్న చిన్నగుడిలో బాబా చిత్రపటం పెట్టి పూజలు చేసుకునేవారు. ఆటోకార్మికులు ప్రసాద్, కోటయ్య, పెంచలయ్య తదితరులతో పాటు ఫ్యాక్టరీ ఉద్యోగులు జి.శివరామ్, ఎం.సత్యనారాయణ, పొన్నవోలు దయాకర్‌రెడ్డి, పివి మోహన్‌రామిరెడ్డి, అప్పటి చీఫ్ జనరల్ మేనేజర్ టివి సుబ్బారావు తదితర భక్తులంతా కలసి శ్రీ సాయి మందిరానికి తమవంతు సేవలందిస్తూ పూజలు సేవలకు కొదవలేకుండా చూస్తూ వచ్చారు. 1996లో శ్రీ షిరిడీసాయి విగ్రహాన్ని షిరిడీ నుంచి తెచ్చి ఇక్కడ ప్రతిష్టించి నిత్యపూజలు చేయడమే కాక, స్వామివారికి నిత్య ధూపదీప నైవేద్యాలకు ఏ లోటూ లేకుండా చేశారు. రోడ్డుపక్కనే ఉన్న గుడి కావడంతో ఆ ప్రాంతంలోని బాబా భక్తులు కూడా నిత్యం వచ్చి స్వామివారిని దర్శించుకుంటూ ఉండేవారు. స్వామివారిని దర్శించుకున్నవారి కోర్కెలు తీరుతుండడం, కష్టాలు తొలగిపోతుండడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య కూడా క్రమేణా పెరుగుతూవచ్చింది. భక్తులకు దైవదర్శనం, ప్రసాదాలతో పాటు తమ వద్ద నిధులేమీ పెద్దగా లేకున్నా అందరూ కలసి భక్తితో, తమవద్ద ఉన్న డబ్బుతోనే తలా కాస్తంత వేసుకుని భక్తులకు నిత్యం అన్నప్రసాద వితరణ చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆ గుడిని మళ్ళీ కొత్తగా నిర్మించి భక్తలోకానికి సమర్పించాలనే ఆలోచనతో నిప్పో అధినేత ఓబులు రెడ్డి కుమారుడు, ఆ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్, బాబా భక్తుడు పొట్టిపాటి ద్వారకానాథ్‌రెడ్డి సంకల్పించడంతో ఆ చిన్ని మందిరానికి మహర్దశ రావడం.. అంతా ఆ బాబా దివ్య సంకల్పమే మరి!.. ఈ ఆలయానికి అనువైన స్థలాన్ని ఆయన ఫ్యాక్టరీ ఆవరణలోనే కేటాయించడంతో పాటు భారీస్థాయిలో ధన వ్యయం చేసి ఆలయాన్ని సర్వాంగసుందరంగా నిర్మించారు. ఈ ఏడాది మే నెల 12, 13, 14 తేదీల్లో శ్రీ సాయినాధుని విగ్రహప్రతిష్టతో పాటు మహాకుంభాభిషేక మహోత్సవాలు కూడా వైభవంగా నిర్వహించారు. ద్వారకామాయి అయిన సాయి దేవాలయాన్ని ద్వారకానాథ్‌రెడ్డి అత్యద్భుతంగా నిర్మించడంతో భక్తుల సంతోషానికి అవధులు లేవు.

## నిత్యపూజలు.. సేవలు :

శ్రీ షిరిడీసాయినాధుని దేవాలయంలో నిత్యపూజలు, హారతులతో పాటు విశేషాభిషేకాలు, అలంకారాలు, ప్రతి గురువారం పల్లకిసేవ వైభవంగా జరుగుతుంటాయి. 'గురుపూర్ణిమ' నాడు స్వామివారికి ఊరేగింపు సేవలు మరింత వేడుకగా ఉంటాయి. శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణోత్సవం, ప్రతిఏటా దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తుంటారు. ఆలయ అర్చకులు ఎన్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో, ఆలయ నిర్వాహకుల నేతృత్వంలో 'నిప్పో' సాయిబాబా దేవాలయం.. షిరిడీసాయి అనుగ్రహంతో దినదినప్రవర్ధమానమవుతోంది.



ఈ నెల 5వ తేదీ గురువారం ఉదయం విజయవాడలోని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన పెన్నా సిమెంట్స్ ప్రెసిడెంట్ టి.శ్రీధర్‌రెడ్డి, పిఆర్ఓ వై.ఎల్.దీపక్‌రెడ్డి

# ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం కృషి..భేష్

**- 'తానా' పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్**



నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తోందని 'తానా' పూర్వ అధ్యక్షుడు డా.తోటకూర ప్రసాద్ కితాబిచ్చారు. ఈనెల 4న ఆయన ఆ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పరిశోధనల ప్రాజెక్టుల వివరాలను పరిశీలించారు. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తెలుగుభాషను చదువుకుంటున్న విద్యార్థులకు, అధ్యయనం చేస్తున్న పరిశోధకులకు సాంకేతికంగా శిక్షణ ఇవ్వడానికి ఈ కేంద్రంతో కలిసి పనిచేస్తానని ఆయన అన్నారు. ఆయనతో పాటు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ ఆచార్య డి.మునిరత్నం నాయుడు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గేరు మార్చి.. స్పీడు పెంచిన సిఎం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలన్నీ తెలుగుదేశం చేస్తున్న కుట్రలో భాగమే అంటూ నేరం నాది కాదు... వారిదే అని తేల్చిపారేశారు. ఇదే సందర్భంగా తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

## ఆకస్మిక మార్పు...

మొత్తంమీద ముఖ్యమంత్రిలో ఆకస్మికంగా తెలియని మార్పు వచ్చిందని స్పష్టమవుతుంది. పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో ఆయన బహుశా ఒక ముప్పైసార్లు బయటకు వచ్చి ఉంటారు. మే 2019లో ఆయన ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన సరిగ్గా 10 నెలలకు కరోనా ప్రపంచాన్ని ఆవహించింది. సుమారు ఒక ఏడాది పాటు ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలను స్థంభింపజేసింది. కరోనా సాధారణ జ్వరం లాంటిదే అని జగన్ కొట్టిపారేసినా, అందరితో పాటు ఆయన కూడా లాక్‌డౌన్ నిబంధనలు పాటించక తప్పలేదు. ఆలా ఒక ఏడాది వృధా అయ్యింది. కానీ మిగిలిన రెండేళ్లలో కూడా ఆయన సెక్రటేరియట్‌కి వెళ్ళింది చాలా తక్కువ. గ్రామ, వార్డు సచివాలయాలను తెరచి ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువచేసే ప్రయత్నం చేశారు తప్ప, ఆయన మాత్రం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండే కార్యకలాపాలు నిర్వహించేవారు. ఇప్పుడు అకస్మాత్తుగా ఆయన తన పార్టీ, ప్రభుత్వ నడవడిక విషయంలో గేరు మార్చి స్పీడు పెంచారు. ఏప్రిల్ రెండవ వారంలో మంత్రివర్గ మార్పులకు శ్రీకారం చుట్టారు. మూడవ వారంలో పార్టీ ప్రక్షాళన చేపట్టారు. నాల్గవ వారంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తాను కూడా ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రజలమధ్యకు వచ్చి అమలు చేయడం మొదలుపెట్టారు. ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి అమలు చేసినా, అనంతపురం, ఒంగోలు, తిరుపతి బహిరంగ సభల నుండి చేసినా కామన్ అజెండా మాత్రం బటన్ నొక్కడమే.

## పార్టీ - ప్రభుత్వం రెండూ... రెండు కళ్ళలా...

ఈ మూడేళ్లలో పార్టీకి పెద్దగా ప్రాధాన్యత లేదు. ప్రభుత్వ విధానాలు, నవరత్నాల అమలు, సంక్షేమ పథకాల ద్వారా డబ్బు పంపిణీ... ఇవే ప్రధాన అజెండా. మిగిలిన సమయమంతా కోర్టు కేసులను ఎదుర్కోవడానికే సరిపోయింది. ఇప్పుడు ఎన్నికలకు ఇంకా రెండేళ్ళ వ్యవధి ఉన్నా 'సమయం లేదు మిత్రమా' అన్న తరహాలో అటు పార్టీ వ్యవహారాలలోనూ, ఇటు ప్రభుత్వ పనితనంలోనూ తన అడుగుల వేగంపెంచారు జగన్. పార్టీ, ప్రభుత్వం రెండూ తనకు రెండు కళ్ళు అనే భావన కలిగేలా దేశంలోనే తొలిసారిగా పార్టీ జిల్లా అధ్యక్షులను 'జిల్లాల సలహామండళ్ళ ఛైర్మన్లుగా' నియమించి వారికీ క్యాబినెట్ హోదా కల్పించి పార్టీతోపాటు ప్రభుత్వంలో కూడా వాళ్ళను భాగస్వామ్యులుగా చేస్తున్నారు. రానున్నరోజుల్లో తమ నాయకుడు ఇంకా ఎక్కువ వేగం పెంచుతారని వైసీపీ శ్రేణులు బల్లగుద్ది మరీ చెప్తున్నారు. అసంతృప్తివాదులను అక్కున చేర్చుకుంటారని, జగన్ అంటే జనం... జనం అంటే జగన్ అనేలా ఇక నెలలో 4చోట్ల పర్యటనలు సాగిస్తారని, త్వరలో తన తండ్రి అసంపూర్ణంగా ఆపేసిన రచ్చబండ, ఆయన హయాంలో అమలుచేసిన ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాలను తమ లీడర్ శ్రీకారం చుడతారన్న ఆశాభావాన్ని పార్టీ క్యాడర్ వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్పులన్నీ ముందస్తు ఎన్నికల కోసమే అని రాజకీయ విశ్లేషకులే కాకుండా పార్టీవర్గాలు చర్చించుకోవడం విశేషం!

# కళాకారులకు 'కళాంజలి' పురస్కారాలు

**8న 33వ వార్షికోత్సవంలో 'యువ అవార్డ్స్' ప్రదానం**

నెల్లూరులోని 'కళాంజలి' సాంస్కృతిక సంస్థ ఈనెల 8న కళాకారులకు పురస్కారాలు అందజేయనుంది. నగరంలోని టౌన్‌హాల్‌లో 8వ తేది సాయంత్రం 6.05 గంటలకు జరుగనున్న ఆ సంస్థ 33వ వార్షికోత్సవంలో 'కళాంజలి పురస్కారం'ను 'శుభమస్తు' షాపింగ్‌మాల్ అధినేత, 'లయన్' బయ్యా రవికుమార్‌కు ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా కళా రంగంలో ప్రతిభతో రాణిస్తున్న యువ కళాకారులకు 'కళాంజలి యువ అవార్డ్స్'ను బహుకరిస్తున్నారు. ప్రముఖ కళాకారులు అనుష, ఆశ్రితారెడ్డి, సంగీత్‌సౌరభ్, గౌరి మానస, జివిఎల్‌బి వార్షి, స్ఫూర్తికలు ఈ అవార్డులను అందుకోనున్నారు. అనంతరం 'కళాంజలి కళాకదంబం' కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 9 నుండి, మధ్యాహ్నం 1 గంట వరకు అన్నమయ్య కీర్తనలు, సినిమా పాటల పోటీలు నిర్వహిస్తామని, ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు 8331924924 ఫోన్ నెంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కళాంజలి సంస్థ నిర్వాహకులు అనంత్ చెప్పారు. మదర్స్‌డేని పురస్కరించుకుని స్వర్గీయ బయ్యా సరోజమ్మ స్మృత్యంకంగా ఇదే వేదికపై పలువురు మహిళా కళాకారులకు కూడా ఆర్థిక పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు.

# టెన్త్ పరీక్షా కేంద్రాల తనిఖీ

నెల్లూరు నగరంలోని పలు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఈ నెల 4వ తేదీ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. కెవిఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని రత్నం ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, మూలాపేటలోని లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, మూలాపేట మునిసిపల్(తాతయ్య బడి) ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను డి ఆర్‌ఓ పరిశీలించారు. విద్యార్థులకు మంచినీటి సౌకర్యం, ప్రథమ చికిత్స ఏర్పాట్లు సజావుగా ఉన్నాయా లేదా విచారించారు.

# నెలాఖరు దాకా ధాన్యం కొనుగోళ్ళు

ధాన్యం సేకరణలో రైతులకు అండగా ఉన్నామని, ఈనెల 4 నుంచి రైతుల వద్ద 2,50,719 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఈ నెలాఖరు దాకా ధాన్యం సేకరణ జరుగుతుందని పౌర సరఫరాల సంస్థ మేనేజర్ పి.పద్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 493 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోళ్ళు చేస్తున్నామని, ధాన్యం సేకరణ కోసం రైతులకు 9.19 లక్షల గోనెసంచులు సిద్ధం చేశామని, 144 రైస్‌మిల్లుల నుంచి 148కోట్ల బ్యాంకు పూచీకత్తు కూడా తీసుకున్నామని ఆమె పేర్కొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఆనం



వెంకటగిరికి చెందిన కాసుల నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యకారణంగా వైద్య చికిత్స పొందగా, వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా సిఎంఆర్ఎఫ్ నిధుల నుండి రూ.1,25,000/-లను ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. ఆ చెక్కును ఈ నెల 5వ తేదీ నెల్లూరులోని తమ నివాసంలో మాజీ మంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి సంబంధిత కుటుంబానికి అందచేశారు.

# ఎన్‌బికెఆర్ విద్యార్థి ప్రతిభ



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో బిటెక్ (కంప్యూటర్స్) చివరి సంవత్సరం చదువుతున్న ఎస్‌కె నజీర్ ఇటీవల సింగపూర్‌కు చెందిన డిబిఎస్ (డెవలప్‌మెంటల్ బ్యాంక్ ఆఫ్ సింగపూర్) సంస్థ వారు నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానం సాధించి తన సత్తా చాటుకున్నాడు. ఆంధ్ర, తెలంగాణల్లోని 200 మంది విద్యార్థులు ఈ పోటీలో ఉండగా నజీర్ టీమ్‌కు మొదటి స్థానం లభించడం విశేషం. దీంతో ఆ సంస్థవారు నజీర్‌కు 60వేల రూపాయల విలువ చేసే యాపిల్-ఐప్యాడ్‌ను బహుమతిగా పంపారు. అంతేకాక నజీర్‌కు డిబిఎస్‌లో 8.9 లక్షల రూపాయల వార్షిక వేతనంతో ఉద్యోగం కూడా లభించిందని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి ఆ విద్యార్థిని అభినందించారు. తమ కళాశాల విద్యార్థులకు ఇప్పటిదాకా మొత్తం 514 మందికి వివిధ కంపెనీల్లో మంచి ఉద్యోగాలు వచ్చాయని, 8.9 లక్షల వార్షిక వేతనంతో డిబిఎస్ సంస్థకు 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్.కిషోర్ ఈ సందర్భంగా తెలిపారు.



# ఘనంగా మెక్సోడియా వేడుకలు

ఎన్‌బికెఆర్ కళాశాలలో ఇటీవల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల మెక్సోడియా-2022 వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సుభాన్సు భండారీ పాల్గొన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇండస్ట్రీ-40, ఐఒటి, ఏఐ వంటి విభాగాల్లో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని, విద్యార్థులు ప్రతిభతో వాటిని సాధించుకోవాలని ఆయన చెప్పారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రియల్ రోబోటిక్స్, 3డి ప్రింటింగ్ విభాగాల్లో పరిశోధనలు చేసేందుకు తమ కళాశాలలో లేబొరేటరీలను ఏర్పాటుచేశామన్నారు. డ్రోన్ టెక్నాలజీస్ వంటి అంశాలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లకు అనేక కళాశాలల నుంచి సుమారు 400 మందికి పైగానే విద్యార్థులు వచ్చారని తెలిపారు. మెకానికల్ విభాగం అధిపతి డా.సిహెచ్ ఆర్.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అవగాహనకు డ్రోన్ వర్క్‌షాప్

చెన్నైకి చెందిన వాయురథ టెక్నాలజీస్ ప్రతినిధి సి.ఆశిష్ ఇటీవల ఎన్‌బికెఆర్‌లో విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీస్ అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తితో ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులందజేశారు.

# మైపాడు శివాలయానికి.. కొత్త పాలకమండలి సభ్యులు

ఇందుకూరుపేట మండలం మైపాడులోని శ్రీ అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వర స్వామి(శివాలయం) ఆలయానికి కొత్త ట్రస్టుబోర్డును ఏర్పాటుచేస్తూ దేవాదాయశాఖ నుంచి తాజాగా ఉత్తర్వులు వచ్చాయని ఆలయ ఇఓ తాతా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాలకమండలి సభ్యులుగా కనుపూరు సురేంద్రబాబు, తోట సుధీర్, ఉడతా సుజాత, కె.రాజమ్మ, కొరుటూరు అశ్విని, సంగం శ్రీనివాసులు, కొమరిక పద్మను ఎంపికచేసినట్లు తెలిపారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శాస్త్రి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని, త్వరలోనే ట్రస్ట్ ప్రమాణస్వీకారం జరుగుతుందని సమాచారం.

## నష్టపోతున్న రైతులు..
# పట్టించుకోని నేతలు
### - మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శ



'బాదుడే బాదుడు' కరపత్రాలను పంపిణీ చేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

జిల్లాలో రైతులు పండించిన వరిధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు అమ్ముకోలేక నానా యాతనలు పడుతున్నారని, అయినా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కానీ, ఎమ్మెల్యేలు కానీ ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని, దీంతో రైతులు తక్కువ ధరలకే పంటను అమ్ముకోవాల్సివస్తోందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈనెల 1న ఆయన తోటపల్లి గూడూరు మండలంలోని ముంగలదొరువు గ్రామంలో ఏర్పాటుచేసిన గౌరవసభలో మాట్లాడుతూ ధాన్యానికి మద్దతుధర పుట్టికి 16,660 రూపాయలున్నా రైతులు మాత్రం 11నుంచి 13వేల రూపాయల లోపే అమ్ముకోవాల్సి వస్తోందని, ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకువెళ్ళేందుకు కూడా మంత్రి కానీ, ఎమ్మెల్యేలు కానీ సాహసించడం లేదని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం పరిశీలించి రైతులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని అరికట్టాలని ఆయన కోరారు. టిడిపి నాయకులు బొమ్మి సురేంద్ర, వేనాటి సతీష్‌రెడ్డి, రాధాకృష్ణనాయుడు, మద్దిన గోపాల్‌నాయుడు, ముత్యాల శ్రీనివాసులు, రవీంద్ర, చేవూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఓవైపు వడదెబ్బ.. మరోవైపు వడగళ్ళు

గత రెండుమూడు రోజులుగా మండిపోతున్న ఎండ. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఎండలు హడలగొట్టేస్తున్నాయి. జనం బయటకు రావాలంటేనే వడదెబ్బ తగులుతుందేమోనని భయపడుతున్నారు. దాదాపు 48 డిగ్రీల ఉష్ణోగ్రతతో జిల్లా అంతా ఉక్కతో సెగలు కక్కుతుంటే..ఈనెల 1వ తేది ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈ మండే ఎండల్లోనూ నేనున్నానంటూ వాన కురవడంతో జనం చల్లని గాలులతో హాయిగా ఊపిరిపీల్చుకున్నారు. పలు మండలాల్లో ఒకమోస్తరుగా కురిసిన వర్షాలు ఊరట కలిగించాయి. మెట్టప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి, కలిగిరి, అనుమసముద్రంపేట, చేజర్ల, సంగం తదితర మండలాల్లో ఉరుములు మెరుపులు.. ఈదురు గాలులు.. ఒకమోస్తరు వర్షంతో పాటు అక్కడక్కడా వడగళ్ళు కూడా పడ్డాయి. అటు వడదెబ్బలు, ఇటు వడగండ్లు దేనినైనా సరే భరించక తప్పదు కదా!.. జిల్లా ప్రజలు అన్ని కష్టాలకీ అలవాటుపడిపోతున్నారు.

# విసనకర్రలతో జనసేన ర్యాలీ

రాష్ట్రప్రభుత్వం విద్యుత్‌చార్జీలు పెంచడంతో ప్రజలు పడుతున్న అవస్తలను ప్రస్తావిస్తూ సర్వేపల్లి నియోజకవర్గం జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్ తదితరుల ఆధ్వర్యంలో మనుబోలులో ఈనెల 1న నగరవీధుల్లో పెద్దఎత్తున జనసేన కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, లాంతర్లు, విసనకర్రలు చేతపట్టుకుని వైఎస్ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించారు. పెంచిన ధరలు తగ్గించాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కలువాయమ్మ తల్లికి.. పాలపొంగళ్ళు



కలువాయి గ్రామదేవత, శక్తి స్వరూపిణి శ్రీ కలువాయమ్మ తల్లికి మే 1న గ్రామప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాలపొంగళ్ళు సమర్పించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఇళ్ళవద్ద పొంగళ్ళు తయారుచేసుకుని సంప్రదాయ బద్ధంగా మహిళా భక్తులు వందలాదిగా ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేసి హారతులిచ్చారు. సాయంత్రం నుంచి భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కలిగింది. గ్రామపెద్దలు, ఆలయ నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# జగన్ కోసం జనం ఎదురుచూపులు!




ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 175 స్థానాలు ఉన్నాయి. 2019లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 175కు 151 స్థానాలను వైసీపీ అధినేత జగన్ గెలుచుకున్నారు. గడువు ప్రకారం 2024 ఏప్రిల్, మే నెలల్లోనే ఎన్నికలు మళ్ళీ జరగాల్సి ఉంది. కానీ, ముందస్తు హడావుడి కనబడుతోంది. ఈ గడువు ఓ ఏడాది ముందుకు జరిగినా జరగవచ్చుననే అభిప్రాయం కూడా రాజకీయవర్గాలలో గట్టిగానే షికార్లు చేస్తోంది. జిల్లాల పర్యటనకు జగన్ సమాయత్తం అవుతున్నారు. జగన్-జనం కూడా... 'మేడ్ ఫర్ ఈచ్ అదర్...' అనిపిస్తుంటుంది, పరస్పర ఆదరాభిమానాలు చూస్తుంటే. జనం కూడా జగన్ ఎప్పుడు వస్తారా అని వేయికళ్ళతో ఎదురు చూస్తున్నారు.

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మొన్నీమధ్య తన పార్టీ నేతలతో ఓ సమావేశం నిర్వహించారు. మంత్రులు, ఎంఎల్ఏలు, ఎం.పీలు, పార్టీ జిల్లాల అధ్యక్షులు, సమన్వయకర్తలు మొదలైనవారు హాజరైన ఈ సభలో పార్టీ నేతలకు జగన్ 'దిశా నిర్దేశం' చేశారు.

గత ఎన్నికల్లో 151 సీట్లు వచ్చాయని ఈసారి ఎన్నికల్లో 175కు 175 ఎందుకు రావొద్దు అని ప్రశ్నించారు. ప్రజలకు ఇప్పటికే లక్షా ముప్పైఏడు వేల కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో వేశామని, మరో లక్షా పదివేల కోట్లు కూడా వేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రం కూడా ఈ స్థాయిలో 'సంక్షేమ' కార్యక్రమాలు అమలు చేయడం లేదని అంటూ ఈసారి 175కి 175 స్థానాలు రావలసిందేనని జగన్ తన పార్టీ సభ్యులకు తేల్చి చెప్పారు. పార్టీని తమ తమ జిల్లాల్లో గెలిపించుకు వచ్చిన వారికే మంత్రి పదవులని కూడా స్పష్టం చేశారు. చాలామంది సిట్టింగ్ ఎంఎల్ఏలపై 'ఫీడ్‌బ్యాక్' బాగా లేదని, వారి గెలుపుపై అనుమానం ఉంటే టికెట్ ఇవ్వనని తెగేసి చెప్పారు.

అయితే, వైసీపీ పార్టీకి జగన్మోహనరెడ్డే ఆది... అంతం. సర్వస్వం. ఆ పార్టీ ఆయన కోసమే పుట్టింది. ఆయన కోసమే బతుకుతున్నది. ప్రజలు ఆయనను చూసే ఓట్లు వేశారు. ముందు ముందు కూడా వేయాలి అని అనుకుంటే ఆయనను చూసే ఓట్లు వేస్తారు.






మొన్న గెలిచిన 151 మందిలో అత్యధికులు ప్రజలలోనుంచి వచ్చినవారు కాదు. జగన్ మనసులోంచి... ఆయన అభిమానంలో నుంచి, ఆయన ఆలోచనల్లోంచి పుట్టుకు వచ్చిన వారు. అందుకే, ప్రజలు వారిని జగన్ ప్రతినిధులుగా భావించి ఆదరించారు. 'జగన్ గాలి'లో వారు అసెంబ్లీకి కొట్టుకు వచ్చారు. కళ్ళు మూసి, తెరిచేలోపు ఎంఎల్ఏలు, ఎంపీలు అయిపోయారు. మంత్రులు అయిపోయారు. చట్టసభలకు కొట్టుకువచ్చిన తరువాత, కొత్తగా వచ్చిన గన్‌మేన్లు, కార్లు, అనుచరులు, నైక్ బూట్లు, రేబాన్ కళ్ళజోళ్ళు, వైట్ & వైట్‌లతో కొందరు 'ప్రజాసేవ'లో మూడేళ్ళకే బాగా ముదిరిపోయారు. ఇదివరకు, పది... పదిహేనేళ్ళు పట్టేది. ఇప్పుడు, 'ప్రజాసేవ' బాగా ఫాస్ట్ అయిపోయింది.

జగన్‌కు వచ్చిన ఫీడ్‌బ్యాక్ సారాంశం బహుశా ఇదే అయివుండవచ్చునని వైసీపీ పరిశీలకులు కొందరు అంటున్నారు. అయితే, ఈ బాపతు ప్రజాప్రతినిధులపై ప్రజలకు కలిగిన అభిప్రాయం వారిపై కలిగినట్టు కాదు. జగన్‌పైనే కలిగినట్టుగా భావించాలి. రాష్ట్రంలోని 26 జిల్లాలలో ఏ చిన్న దుస్సంఘటన జరిగినా... దానికి ప్రజలు సీఎంనే బాధ్యులుగా భావిస్తారు. అలాగే, ఏ కొంచెం మంచి జరిగినా... ఆ 'క్రెడిట్' ముఖ్యమంత్రి ఖాతాలోకి ఆటోమాటిక్‌గా వెళ్ళిపోతుంది. (మన ప్రజాస్వామ్యంలో ఇదొక ముఖ్య సుగుణం) మధ్యలో మంత్రులు, ఎంఎల్ఏలు, ఎం.పీలు నిమిత్తమాత్రులు. అందువల్ల, వీరు పార్టీని గెలిపించడం, గెలిపించకపోవడం అంటూ ఏమీ ఉండదు. వైసీపీ గెలిచినా... ఓడినా జగన్మోహనరెడ్డే ముఖ్యకారకులు.

మొన్నటి వైసీపీ ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన చెప్పింది వైసీపీ నాణానికి ఒకవైపు అయితే, క్షేత్రస్థాయి పరిస్థితులు రెండో వైపు.

రెండే రెండు ప్రశ్నలు...!

గత ఎన్నికల్లో... పార్టీలకు, కులాలకూ, మతాలకూ అతీతం అన్నట్టుగా ఆడవారు, మగవారు, వృద్ధులూ, కొత్తగా ఓటు హక్కు వచ్చినవారూ (రాని వారూ...), ఉద్యోగులూ, నిరుద్యోగులూ, ట్రాన్స్‌జెండర్స్‌తో సహా జనం అంతా విరగబడి.... వెర్రెత్తినట్టు... పూనకం వచ్చినట్టు.... పిచ్చెత్తినట్టు రాత్రి 12 గంటల వరకు క్యూలైన్లలో నిలబడి మరీ వైసీపీకి ఓట్ వేశారు. ఈసారీ అదే పూనకంతో, అదే ఆవేశంతో, అదే ఊపుతో, అదే 'ఇది'తో, 'అదే స్థాయి'లో జగన్‌కు ఓట్ వేస్తారా?

ఇది మొదటి ప్రశ్న?

ఇక రెండవ ప్రశ్న?

వైసీపీకి అనుకూలంగా ఇంత పూనకంలో జనం పడిపోయి... పోలేరమ్మ జాతరలో లాగా ఊగిపోయిన స్థితిలో కూడా తెలుగుదేశం పార్టీకి దాదాపు 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ 40 శాతంలో ఎంత శాతం మంది ఈసారి తెలుగుదేశంకు ఓట్ వేయకుండా ఉంటారు?

గత ఎన్నికల్లో వైసీపీకి ఓట్ వేసిన వారు ఏక మొత్తంగా అదే అభిమానంతో.. అదే ఆవేశంతో.. అదే ఊపుతో.. ఈసారీ ఓట్‌వేస్తే వైసీపీకి మళ్ళీ 151 సీట్లు ఖాయం!. అలాగే 22 ఎంపీ సీట్లు కూడా ఖాయం. ఇక, అప్పుడు జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలు చేయాల్సిందేమీ ఉండదు. వీరంతా 2019 ఎన్నికలకు ముందు లేరు కదా! వారి అవసరం అప్పుడు పడలేదు కదా! అలాగే, టీడీపీ కూడా ఆ 40శాతానికే పరిమితం అయితే... మళ్ళీ ప్రతిపక్షమే కదా!

ఒకవేళ వైసీపీని గెలిపించడానికి 2019లో లాగా... ఈసారి జగన్ బలం ఒక్కటే చాలదు అనుకుంటే, ఆయన నీడలో సేద తీరుతున్న ఈ జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తల 'బలం' ఏ మూలకి? మాటవరుసకు మొన్న అమలాపురంలో కుడిపూడి చిట్టిబ్బాయి స్మారకసభలో పాల్గొనడానికి వచ్చిన టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి, ఎదురుగా మోకాళ్ళపై కూర్చుని, తల నేలకు ఆనించి, ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసిన రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఎన్ని సీట్లలో వైసీపీని కోనసీమ జిల్లాలో గెలిపించగలరు?

అయితే, ఎన్నికలు ఇప్పటికిప్పుడే జరగడం లేదు. వాటిని ముందుకు జరపాలనుకోక పోతే, ఇంకా రెండు సంవత్సరాల వ్యవధి ఉంది.

ఇప్పటికే 95% హామీలను నెరవేర్చామని ముఖ్యమంత్రి జగన్ మొన్నటి సమావేశంలో సగర్వంగా చెప్పారు. ఇక, అయిదు శాతానిదేముంది?. ఆడుతూ... పాడుతూ... అమలు చేసేయవచ్చు.

అయితే, జగన్ గానీ, ఆయన సలహాదారులు గానీ, ఈ రెండు ప్రశ్నలకు సమాధానాలు కనిపెట్టడంపై దృష్టిపెట్టాలి.

1. 2019లో వైసీపీకి ఓట్ వేసిన వారంతా ఇప్పుడూ 100% ఓట్ వేస్తారా?
2. 2019లో టీడీపీకి ఓట్ వేసిన 40% ఓటర్లలో ఎంతమంది ఇప్పుడు వెనక్కి తగ్గుతారు? అంటే టీడీపీకి కాకుండా, వైసీపీకి వేస్తారు?
3. వైసీపీకి గానీ, టీడీపీకి గానీ అప్పుడు ఓట్‌వేసిన వారు ఇప్పుడు అదే సరళిలో ఓట్ వేసే అవకాశం ఏ శాతం మేరకు ఉంది? లేకపోతే ఏ శాతం మేరకు లేదు?

ఈ చిన్ని చిన్ని ప్రశ్నలకు సమాధానాలను కనుక్కుంటే 2024 ఎన్నికల కథా కమామిషుపై క్లారిటీ వస్తుంది.

2019 నాటి ఫలితాలను మించి మరో 23 స్థానాలు సాధించడానికి మంత్రులు, మాజీమంత్రులు, జిల్లా అధ్యక్షులు, జిల్లాల సమన్వయకర్తల నుంచి ఎక్కువ ఆశించకుండా ముఖ్యమంత్రే స్వయంగా రంగంలోకి దిగాల్సిన అవసరం ఉన్నదేమో వైసీపీ వ్యూహకర్తలు ఆలోచించాలి. 2019లో లాగా ప్రజలు బ్రహ్మరథం పడతారని జగన్ అనుకుంటుంటే, అడుగడుగునా పూలవర్షం కురిపిస్తారని భావిస్తూ ఉంటే ప్రతి నియోజకవర్గం, ప్రతి ఊరూ.. వాడా ఆయనే స్వయంగా సందర్శించాలి. ఆయన్ను చూడగానే పూనకానికి.. ఉద్వేగానికి.. ఆవేశానికి, గజమాలల సత్కారానికి సిద్ధమైపోతారు. 2019లో లోనైనవారు... ఇప్పుడు ఎందుకు లోనవ్వరు? అప్పుడు 175కి 151 ఇచ్చినవారు ఇప్పుడెందుకు 175 ఇవ్వరు?

అయితే, అప్పటికీ, ఇప్పటికీ ముఖ్య తేడా ఒకటి కనపడుతున్నది.

అప్పుడు పోలీసుల మోహరింపు లేదు. ఆయన చుట్టూ 'ఇనుప' కంచెలు లేవు. రోడ్‌మార్జిన్‌లలో ఇనుప బారికేడ్లు కట్టి, ఇళ్ళల్లోంచి జనం బయటకు రాకుండా తలుపులకు తాళాలు వేయడాలు లేదు, తలుపులను బిగించుకోమనడం లేదు. పోలీసు వలయాలు లేవు. అందుకే, ఆయన తన ప్రజలను స్వేచ్ఛగా కలుసుకోగలిగారు. ప్రజలు తమ ప్రియతమ నేతను కలుసుకోగలిగారు. ఆయనతో మమేకమయ్యారు. కలివిడిగా తిరిగారు. కరచాలనాలు చేశారు. అవ్వలు తాతలు... ఆయన భుజాలపై చేతులువేసి... చేతిలో చేతులేసి... అడుగులో అడుగులేసి, మోహంలో మోహాలు పెట్టి... నడకలో నడక కలిపారు. అనిర్వచనీయానంద లోకాలలో తేలిపోయారు. పోలీసులు ప్రేక్షకపాత్ర మాత్రమే నిర్వహించారు. నోటికీ, లాఠీలకూ పని చెప్పలేదు. అందుకే, జగనన్నకు ప్రజలు 151 సీట్లు కట్టబెట్టారు.


ఇప్పుడు కూడా జగన్ నుంచి వారు, వారి నుంచి జగన్ అదే తరహా పరస్పర ఆత్మీయత ఆశించడం సహజం.

'ముందు నుంచి ఉన్న చెవుల కంటే... వెనుక వచ్చిన కొమ్ములు వాడి' అన్నట్టుగా... మధ్యలో వచ్చి, జనాలను అదే పనిగా 'డొక్కలో పొడుస్తున్న' ఎం.ఎల్.ఏ.లు, జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలను వెంటేసుకుని జగన్ ప్రజల దగ్గరకు వెళ్లకుంటే... అదే 175 సీట్లు వచ్చినంత ఫలితం. ఇక అంతకంటే ఇవ్వడానికి వీలు లేదు. లేకపోతేనా...!?

**- భోగాది వేంకట రాయుడు**
venkata_bhogadi

# అమ్మ

అమ్మకు అంజలి



## శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ

02.05.1951 - 10.05.2016

ప్రతి ఆలోచన మా గురించే అని మురిసిపోయేవాళ్లం. కాని మీ ప్రతి ఆలోచనను మాకు జ్ఞాపకంగా మిగులుస్తారని అనుకోలేదు.. మహోన్నత వ్యక్తిత్వం కలిగిన మీ పవిత్ర ఆత్మకు 6 వ వర్ధంతి సందర్భంగా ఇదే మా అంజలి.

కుమారుడు - కోడలు
పందిళ్ళపల్లి హేమంత్ రెడ్డి - సింధు

మనుమరాలు - మనవడు
కామాక్షి హన్విత రెడ్డి , వియాన్ష్ రెడ్డి

కుమార్తె - అల్లుడు
నిరూప - చెర్లో కోటారెడ్డి

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com